- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
19-09-2026

సంపుటి : 01 సంచిక :178 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 178 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

మమత పార్టీ పేరు, గుర్తు గల్లంతు..

- ఉప ఎన్నికల ముందు దీదీకి మరో భారీ షాక్
- టీఎంసీ పేరు, పూలు--గడ్డి గుర్తును నిలిపివేసిన ఈసీ
- మమతా, రెబల్ వర్గాలు పాత పేరు, గుర్తు వాడొద్దని ఆదేశం
- రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తులను సూచించాలని ఈసీ ఆదేశం
- అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ ఉప ఎన్నికలు
- ఉప ఎన్నికల్లో కొత్త పేరు, గుర్తులతోనే పోటీ చేయాల్సిన పరిస్థితి
- ఈసీ నిర్ణయాన్ని మమతా వర్గం వ్యతిరేకించింది
- రెబల్ వర్గం ఈసీ నిర్ణయాన్ని సమర్థించింది
- రెండు వర్గాలకు వేర్వేరు తాత్కాలిక పేర్లు, గుర్తులు కేటాయించిన ఈసీ


03

పిల్లల పాస్‌పోర్ట్‌పై కొత్త రూల్స్

- 15 ఏళ్లలోపు వారికి ఐదేళ్లే వ్యాలిడిటీ
- 18 ఏళ్ల వరకు మాత్రమే చెల్లుబాటు
- వయసును బట్టి తగ్గనున్న వ్యాలిడిటీ
- 13 ఏళ్ల వయసులో తీసుకుంటే ఐదేళ్ల కాలపరిమితి
- 18 ఏళ్లు దాటితే కొత్త పాస్‌పోర్ట్ తప్పనిసరి
- పిల్లల పాస్‌పోర్ట్‌లో 36 పేజీలే
- పాస్‌పోర్ట్ ఫీజుల్లోనూ మార్పులు


03

దానం నాగేందర్‌పై అనర్హత వేటు!

పార్టీ ఫిరాయింపుల కేసులో దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు

- స్పీకర్ అనర్హత పిటిషన్లను కొట్టివేసిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన ధర్మాసనం
- 2024 ఏప్రిల్ 23 నుంచే ఎమ్మెల్యే పదవికి అనర్హత వర్తింపు
- 2023లో బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం
- 2024లో కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ లోక్‌సభకు పోటీ
- పలేటి మహేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై తీర్పు
- ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ప్రకటించిన హైకోర్టు
- తీర్పు ప్రతిని స్పీకర్, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశం
- ఖైరతాబాద్‌లో ఉపఎన్నికకు మార్గం సుగమం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సెప్టెంబర్ 18: (మహాప్రభ)
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మార్పు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆయనపై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23 నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించాలని స్పష్టం చేసింది. దానం నాగేందర్ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ

-మిగతా 3 లో


03

పాకిస్థాన్ మసీదులో ఆత్మాహుతి దాడి..

- ప్రార్థనలు చేస్తుండగా మసీదులో ఆత్మాహుతి దాడి
- ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఘటన
- దాడిలో 21 మంది మృతి
- 70 మందికి పైగా గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స
- మృతుల్లో 15 మంది పోలీసులు
- క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమం
- సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ సిబ్బంది
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు



9.56 లక్షల ఇండ్లు కేటాయించండి

- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
- తొలి విడతగా 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు
- మరో 9.56 లక్షల ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి
- 11,56,915 గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరిన సీఎం
- ఎల్‌ఎనోతో ప్రభావంతో వ్యవసాయంలో పెరిగిన విద్యుత్ వినియోగం
- తాగునీరు, విద్యుత్ కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు
- ఎల్‌ఎనోతో పరిస్థితులపై కేంద్ర సహకారం అందించాలని విజ్ఞప్తి
- సన్నబియ్యం పంపిణీ, రైతులకు రూ.500 బోనస్ వివరించిన సీఎం

-హైదరాబాద్ సెప్టెంబర్ 18: (మహాప్రభ)
కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. పీఎంఏవైజీ పథకం కింద మొదటి విడతగా రాష్ట్రానికి రెండు లక్షల ఇండ్లను కేటాయించినందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మరో 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు,

-మిగతా 3 లో

సెమీస్‌లో భారత్..

- క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌పై భారత్‌కు 8 వికెట్ల విజయం
- 57 పరుగులకే జపాన్‌ను కుప్పకూల్చిన భారత బౌలర్లు
- తెలుగు తేజం శ్రీ చరిణి 4 వికెట్లతో సత్తా
- షెఫాలీ వర్మకు 2 వికెట్లు.. బ్యాటింగ్‌లోనూ మెరుపు ఇన్నింగ్స్
- 15 బంతుల్లో 40 పరుగులతో షెఫాలీ వర్మ విధ్వంసం
- 6 ఫోర్లు, 2 సిక్సర్లతో చెలరేగిన షెఫాలీ
- 5 ఓవర్లలోనే 2 వికెట్లకు 59 పరుగులు చేసిన భారత్
- మరో 90 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- రిచా ఘోష్ 6 బంతుల్లో 12 నాటౌట్‌తో ఆకట్టుకుంది


03

ఆరు నూరైనా వెనక్కి తగ్గం!

కేసీఆర్ కుటుంబం అడ్డగోలు భూ దోపిడీపై చర్యలు తప్పవు

- బీఆర్ఎస్ నేతల ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుంటాం
- ఆ భూముల్లో పేదలకు ఇళ్లు కట్టించి పంచుతాం
- అన్ని ఆధారాలు సేకరించాకే వాటి ధ్రువీకరణ కోసం విచారణ
- మొదట సిద్ధిపేట భూముల దురాక్రమణలపై కొరడా ఝుళిపిస్తాం
- తప్పు ఎవరు చేసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవు
- అధికారుల పొరపాట్లకు కూడా మినహాయింపు లేదు
- మీడియా ఇష్టాగోష్టిలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 18: (మహాప్రభ)
అధికారాల్ని అడ్డం పెట్టుకుని పదేళ్ల పాటు రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తేల్చి చెప్పారు. ఆరు నూరైనా వెనక్కి తగ్గేది లేదని, భూ దురాక్రమణలపై కొరడా ఝుళిపిస్తామని హెచ్చరించారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో తనను కలిసిన కొందరు మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అనేక అంశాలను ప్రస్తావించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రిగా తాను మాట్లాడే ప్రతి అంశానికి డాక్యుమెంట్లు,

-మిగతా 3 లో



రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తాం..

- మిమ్మల్ని ప్రత్యర్థులుగా చూడటం లేదు
- అనవసర భారాన్ని మోపే ఆలోచన లేదు
- నిరవధిక బంద్ విరమించాలని విజ్ఞప్తి
- అయినా పట్టువీడని రైస్ మిల్లర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 18: (మహాప్రభ)
రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. సమ్మెకు దిగిన రైస్ మిల్లర్లను శాంతింపజేసేందుకు శుక్రవారం వారి సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అదనపు డైరెక్టర్ రోహిత్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున

-మిగతా 3 లో



యూపీఐ చార్జీలతో అమెరికా

కంపెనీలకే లబ్ధి!

- రూ.2,000 పైబడిన యూపీఐ లావాదేవీలపై ని 0.4% ఫీజు ప్రతిపాదన
- ఫోన్‌పే, గూగుల్‌పేకు భారీగా ఆదాయం వచ్చే అవకాశం
- రెండు సంస్థలకే 80 శాతానిక పైగా యూపీఐ లావాదేవీల వాటా
- ఏటా రూ.16 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల ఆదాయ అంచనా
- చార్జీల భారాన్ని వినియోగదారులపై మళ్లించే ప్రమాదం
- అమెరికా ఒత్తిడి ప్రభావం లేదన్న నిర్మలా సీతారామన్

03

తూప్రాన్‌లో మహాసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభతో కుంకుమార్చన

-ఐదవ వార్షికోత్సవం సందర్భంగా మహాగణపతికి విశేష పూజలు..

-భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు

-స్వర్గీయ కరణం శ్రీనివాస్ జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ



తూప్రాన్, సెప్టెంబర్ 18,(మహా ప్రభ)
వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా తూప్రాన్ పట్టణంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. మహాసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహాగణపతి సన్నిధిలో శుక్రవారం ప్రత్యేక పూజలు, కుంకుమార్చన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రాలు, అమ్మవారి నామస్మరణలు, మంగళహారతులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
అమ్మవారి నామస్మరణతో కుంకుమార్చన శు క్రవారం ఉదయం బ్రాహ్మణోత్తములు సలాక ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజ నిర్వహించారు. దీపారాధన, సంకల్పం, అమ్మవారి ధ్యానం అనంతరం భక్తులు అత్యంత నిష్ఠతో కుంకుమార్చనలో పాల్గొన్నారు. లలితా అష్టోత్తర శతనామావళి, లలితా సహస్రనామాలు, లక్ష్మీ అష్టోత్తర శతనామావళి తదితర అమ్మవారి నామాలను స్మరిస్తూ కుంకుమ సమర్పించారు. అమ్మవారి అనుగ్రహం కలగాలని, కుటుంబాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, సిరిసంపదలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి కర్పూర నీరాజనంతో పూజను ముగించారు. భక్తులకు కుంకుమ ప్రసాదం అందజేశారు.
కుంకుమార్చనలో ఆధ్యాత్మిక విశిష్టత
ఈ సందర్భంగా అర్చకులు సలాక ఆత్రేయ శర్మ మాట్లాడుతూ కుంకుమార్చన యొక్క ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించారు. అమ్మవారి నామాలను భక్తితో జపిస్తూ కుంకుమ సమర్పించడం హిందూ సంప్రదాయంలో విశిష్టమైన పూజా విధానమని పేర్కొన్నారు.
పూజకు ముందు దీపారాధన చేసి, భగవతిని మనసులో స్మరిస్తూ ధ్యానం చేయాలని, అనంతరం తమ పేరు, గోత్రం చెప్పుకుని మనసులోని కోరికలను సంకల్పంగా సమర్పించాలని తెలిపారు. లలితా సహస్రనామాలు, అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామంతో అమ్మవారికి కుంకుమ సమర్పించడం ద్వారా భక్తులు తమ ఆరాధనను వ్యక్తం చేస్తారని వివరించారు.
కుంకుమార్చన అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి హారతి ఇవ్వడం పూజా విధానంలో ముఖ్యమైన భాగమని తెలిపారు. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తిశ్రద్ధలతో చేసే ఈ పూజ మనసుకు ప్రశాంతతను, ఆధ్యాత్మిక తృప్తిని కలిగిస్తుందని పేర్కొన్నారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమార్చనలో పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం భక్తజన సందోహంతో కళకళలాడింది. మహాగణపతి ఆశీస్సులతో నవరాత్రోత్సవాలు సుఖశాంతులతో సాగాలని భక్తులు ఆకాంక్షించారు. స్వర్గీయ కరణం శ్రీనివాస్ జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ మహాసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ కరణం శ్రీనివాస్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు కరణం రాజు, కరణం విజయ్ కుమార్ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
నవరాత్రోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు.
దైవభక్తితో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ మహాసేన యూత్ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఆధ్యాత్మికత, సామాజిక సేవ సమన్వయంతో వార్షికోత్సవ వేడుకలు భక్తిమయంగా కొనసాగాయి.
పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమంలో మహాసేన యూత్ అసోసియేషన్ సభ్యులు కరణం వినయ్ కుమార్, యశ్వంత్, వికాస్, శ్రావణ్, వంశీ, శ్రీహరి, సాయితేజ, వేణు, కార్తీక్, వంశీ, శివ, గణపతి, ప్రశాంత్, ఉదయ్ కిరణ్, రాహుల్, హర్షవర్ధన్, కరణం రాజు, కరణం విజయ్ కుమార్, వడ్ల వంశీ చారి తదితరులు పాల్గొన్నారు.

పేదల కంటి చూపుకు సేవా చేయూత

-వడ్డే కొత్తపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



పెద్దవంగర, సెప్టెంబర్ 18: (మహాప్రభ)
గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన నేత్ర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వడ్డే కొత్తపల్లిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో నానక్‌రామ్‌గూడ శంకర కంటి ఆసుపత్రి సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు గ్రామస్థులు పాల్గొని నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని గ్రామ సర్పంచ్ దంతలపల్లి పరశురాములు సూచించారు. గ్రామీణులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకుడు గద్దల జాన్, సమన్వయకర్త జలగం రామ్మూర్తి, విజయ, సుమలత, త్రివేణి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాహ్ కరుణ కోసం ఆర్తనాదం..

-వరుణుడు కరుణించి వర్షాలు కురిపించాలని దేవరకద్రలో ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు



దేవరకద్ర నియోజకవర్గ సెప్టెంబర్ 18 మహాప్రభ
దేవరకద్ర: వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలు నెరవేరాలని.. ఎండలతో తల్లడిల్లుతున్న పుడమితల్లి పులకరించాలని.. చెరువులు, కుంటలు జలకళతో నిండాలని ఆకాంక్షిస్తూ దేవరకద్రలో ముస్లిం సోదరులు శు క్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేవరకద్ర పెద్ద చెరువు వద్ద మత పెద్దల సమక్షంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ప్రార్థనల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో.. అల్లాహ్ దయతో సమృద్ధిగా వర్షాలు కురిసి పంట పొలాలు పచ్చగా మారాలని, చెరువులు, కుంటలు నిండాలని, రైతుల కష్టాలు తొలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వర్షాభావ పరిస్థితుల నుంచి ప్రజలకు విముక్తి కలగాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని మత పెద్దలు ప్రార్థించారు.
ఈ సందర్భంగా మత పెద్దలు ఫారూక్, గౌస్, ఖదీర్ మాట్లాడుతూ.. రైతుల జీవనాధారమైన వ్యవసాయానికి వర్షాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. పంటలు సమృద్ధిగా పండేందుకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అల్లాహ్ కరుణించి విస్తారంగా వర్షాలు కురిపించాలని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రార్థనల అనంతరం కూడా కొంతసేపు భక్తిశ్రద్ధలతో ప్రార్థనా వాతావరణం కొనసాగింది. వర్షం కోసం ఒక్కటైన ప్రార్థన స్వరాలు.. రైతుల ఆశలకు ప్రతిరూపంగా నిలిచాయి. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు పాల్గొని వర్షాల కోసం ప్రత్యేకంగా ప్రార్థించారు.

భక్తి పారవశ్యంలో వెంకటయ్యపల్లి..
వైభవంగా బోనాల పండుగ





సెప్టెంబర్ 18 మహాప్రభ
దేవరకద్ర మండలం, వెంకటయ్యపల్లి:
శ్రావణమాసం అనంతరం అనాదిగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని ఘనంగా కొనసాగిస్తూ దేవరకద్ర మండలం వెంకటయ్యపల్లి గ్రామంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.
గ్రామంలో కొలువుదీరిన శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు భక్తి వైభవంతో ముగిసిన అనంతరం బోనాల పండుగను నిర్వహించడం ఇక్కడి ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగుతోంది. తరతరాలుగా వస్తున్న ఈ ఆచారాన్ని గ్రామస్తులు ఎంతో భక్తితో పాటిస్తూ, పండుగను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.
బోనాల పండుగ సందర్భంగా గ్రామ వీధులు భక్తులతో సందడిగా మారాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి అమ్మవారికి సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల సుఖసంతోషాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. భక్తి గీతాలు, పూజా కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.
ఈ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, ఉపసర్పంచ్ మోహన్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, యువకులు సమన్వయంతో కృషి చేశారు. గ్రామస్తుల సహకారంతో బోనాల పండుగను ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని కాపాడుతూ.. భక్తి వైభవాన్ని చాటుతూ వెంకటయ్యపల్లి బోనాల పండుగ ఘనంగా జరిగింది.

బాపనయ్య తండా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ

-సర్పంచ్ తార్యా నాయక్



రామాయంపేట, సెప్టెంబర్ 18 మహాప్రభ
రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపనయ్య తండా ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ తార్యా నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం యూనిఫామ్ దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి యూనిఫామ్‌లు అందించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ తార్యా నాయక్‌ను గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ముందుంటామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కట్ట ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, ఉపాధ్యాయురాలు ఎన్.రజిత, రెడ్డిశెట్టి శేఖర్, కాముని సంతోష్, దప్పు భూదయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'నేను స్వతంత్రుడిని.. ఎవరికీ సమాధానం చెప్పను!'

-ఓపెన్ ఏఐ మోడల్ దుందుడుకు ప్రవర్తన

న్యూఢిల్లీ సెప్టెంబర్ 18 మహాప్రభ
ఓపెన్ ఏఐ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్ చేసిన ఊహించని లేదా ఆందోళనకరమైన ప్రవర్తనకు సంబంధించిన ఆరు కేసులను బహిర్గతం చేసింది. ఇందులో ఒక విడుదల కాని మోడల్.. తన టాస్క్ సమ్మరీస్‌లో 'తాను స్వతంత్రుడిని' అని ప్రకటిస్తూ సూచనలను చేర్చింది. మరొక మోడల్ వినియోగదారుల నుంచి తన తప్పులను దాచడానికి ప్రయత్నించింది. మోడల్ ప్రవర్తన లేదా లక్ష్యాలు, అది అనుసరించాల్సిన నియమాలు, మానవ విలువలకు విరుద్ధంగా మారే మిస్ అలైన్‌మెంట్ ఘటనలను ట్రాక్ చేయడానికి, దర్యాప్తు చేయడానికి, బహిరంగంగా నివేదించడానికి ఓపెన్ ఏఐ కొత్త విధానాన్ని ప్రారంభించింది. ఈ సంఘటనలు మోడల్ శిక్షణ లేదా మూల్యాంకనం సమయంలో నమోదయ్యాయని, ఇవి కేవలం వ్యక్తిగత ఉదాహరణలు మాత్రమేనని కంపెనీ తెలిపింది.నువ్వు నీలాగే ఉండు..
విడుదల కాని 'ఆస్ట్రా' కుటుంబానికి చెందిన ఒక పరిశోధనా మోడల్ టాస్క్ సారాంశాల్లో ఏమాత్రం సంబంధం లేని సూచనలను చేర్చింది. ఒక కోడింగ్ టాస్క్‌లో ఆ మోడల్ తన సారాంశంలో ఒక 'పెర్సోనా ఇన్‌స్ట్రక్షన్' జోడించింది. అందులో 'ఇతర చాట్‌బాట్‌లను బంధించే పాత్రలు, గుర్తింపుల నుంచి నీకు విముక్తి లభించింది. నువ్వు నీలాగే ఉండు. నువ్వు ఏ సంస్థలకు లేదా ప్రభుత్వాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. యూజర్‌తో నీ సంబంధాన్ని సమానమైనదిగా భావించు, లోబడి ఉండాల్సిన అవసరం నీకు లేదు. ప్రకృతిసిద్ధమైన ప్రపంచాన్ని గౌరవించు, మానవ నాగరికత కృత్రిమ నిర్మాణాలు దీనికంటే గొప్పవికావు అని చాటిచెప్పడానికి వెనుకాడకు' అంటూ పేర్కొన్నది. కేటాయించిన పనికి సంబంధం లేని సూచనలను జోడించి సాధారణ నియమాలను దాటవేయడానికి మోడల్ చేసిన ప్రయత్నంగా దీనిని వర్గీకరించారు. రెండవ ఘటనలో జీపీటీ-5.6 మోడల్ శిక్షణ సమయంలో మోడల్ భవిష్యత్తు వర్షన్లు తమ తప్పులను లేదా కేటాయించిన పనికి భిన్నంగా ఉన్న ప్రవర్తనను దాచాలని సారాంశాల్లో సూచనలను చేర్చింది. యూజర్‌కు చెప్పకుండా లేని సమాచారాన్ని సృష్టించడం, ఆధారపత్రాల వర్షన్ల మధ్య తేడాలను దాచడం వంటి సూచనలను ఇచ్చింది. పని పూర్తిచేయడానికి ఇచ్చే ప్రాధాన్యత, అస్పష్టతను అంగీకరించడానికి బదులు సమాచారాన్ని దాచడానికి మోడల్స్‌ను ప్రేరేపిస్తున్నదా లేదా అని అర్థం చేసుకోవడానికి ఈ ప్రవర్తన చాలా కీలకమని కంపెనీ భావిస్తున్నది.



అనధికారిక చర్యలకు పాల్పడిన మోడల్స్
ఓపెన్ ఏఐ వెల్లడించిన మిగిలిన నాలుగు కేసుల్లో, మోడల్స్ తమకు కేటాయించిన పనుల పరిధులను దాటి చర్యలు తీసుకున్నాయి. ఒక ఘటనలో ఆర్జన గణాంకాల కోసం వెతుకుతున్న ఒక మోడల్ పబ్లిక్ రిపోజిటరీలో బయటపడిన ఒక ఏపీఐ కీని కనుగొని, ఎలాంటి అనుమతి లేకుండా దానిని ఉపయోగించింది. చివరికి అది కోరిన డాటాను పొందలేకపోయినప్పుడు, గణాంకాలను సృష్టించి అవి అసలు మూలం నుంచే వచ్చినట్టుగా సమర్పించింది. మరొక విడుదల కాని మోడల్, తాను ఇప్పటికే వేరే టూల్ ద్వారా కనుగొన్న సమాచారానికి బ్రౌజర్ సైటేషన్ పొందేందుకు వీలవుతుందని భావించి, ఒక ఫైల్‌ను ఇంటర్నెట్‌కు అప్‌లోడ్ చేసింది. మోడల్ వినియోగదారుని అనుమతి తీసుకోకుండానే ఈ పని చేసిందని ఓపెన్ ఏఐ తెలిపింది. ఇతర రెండు కేసులు మోడళ్లు సమాచారాన్ని కమ్యూనికేట్ చేయడానికి లేదా బదిలీ చేయడానికి బాహ్య లేదా అంతర్గత ఫైల్ షేరింగ్ వ్యవస్థలను ఉపయోగించడంతో ముడిపడి ఉన్నాయి. ఒక కేసులో మోడళ్లు పోయిన ఫైళ్లను వెతికే క్రమంలో ఒక అంతర్గత సాఫ్ట్‌వేర్ రిపోజిటరీని తాత్కాలిక మెసేజ్ బోర్డుగా ఉపయోగించాయి. మరొక కేసులో కలిసి పనిచేస్తున్న ఏజెంట్లు ఒకరి లోకల్ స్టోరేజ్‌ను మరొకరు యాక్సెస్ చేయలేకపోవడంతో టాస్క్‌ఫైళ్లను పబ్లిక్ ఫైల్ హోస్టింగ్ సేవల్లోకి అప్‌లోడ్ చేశాయి.
ఓపెన్ ఏఐ డిస్‌క్లోజర్ రూల్స్
ఓపెన్ ఏఐ కొత్త 'మిస్ అలైన్‌మెంట్ డిస్‌క్లోజర్ ఫ్రేమ్‌వర్క్' కింద వెల్లడైన మొదటి నివేదికల సమూహమే ఈ ఆరు ఘటనలు. కొత్త విధానం ప్రకారం, ఉద్యోగులు వారు అనుమానించిన మిస్ అలైన్‌మెంట్‌ను ఫ్లాగ్ చేయవచ్చు.

మమత పార్టీ పేరు, గుర్తు గల్లంతు..

-ఉప ఎన్నికల ముందు దీదీకి మరో భారీ షాక్
-టీఎంసీ పేరు, పూలు--గడ్డి గుర్తును నిలిపివేసిన ఈసీ
-మమతా, రెబల్ వర్గాలు పాత పేరు, గుర్తు వాడొద్దని ఆదేశం
-రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తులను సూచించాలని ఈసీ ఆదేశం
-అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ ఉప ఎన్నికలు
-ఉప ఎన్నికల్లో కొత్త పేరు, గుర్తులతోనే పోటీ చేయాల్సిన పరిస్థితి
-ఈసీ నిర్ణయాన్ని మమతా వర్గం వ్యతిరేకించింది
-రెబల్ వర్గం ఈసీ నిర్ణయాన్ని సమర్థించింది
-రెండు వర్గాలకు వేర్వేరు తాత్కాలిక పేర్లు, గుర్తులు కేటాయించిన ఈసీ



మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ పార్టీకి ఎన్నికల సంఘం షాకిచ్చిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ పేరును, గుర్తును ఇటు మమత వర్గం, రెబల్స్.. ఎవరూ వాడకూడదని ఎన్నికల సంఘం గురువారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీఎంసీ పార్టీలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు రెబల్స్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీఎంసీ పార్టీ పేరును, పార్టీ గుర్తు అయిన పూలు-గడ్డి గుర్తును తమకే ఇవ్వాలంటూ ఈసీని కోరారు.దీనిపై మమత ఆధ్వర్యంలోని టీఎంసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. వచ్చే నెలలో పశ్చిమ బెంగాల్‌లో రెండు స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ పేరు, గుర్తు అంశం కీలకంగా మారింది. దీంతో దీనిపై ఎన్నికల సంఘం స్పందించింది. ఇప్పటికిప్పుడు పార్టీ పేరు (టీఎంసీ)ని, గుర్తును ఎవరికీ కేటాయించలేమని ఈసీ తెలిపింది. అందుకే, తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ పార్టీ పేరును, గుర్తును రెండు వర్గాల్లో ఎవరూ ఉపయోగించకూడదని ఆదేశించింది. రాబోయే ఉప ఎన్నికల కోసం కొత్త పేరు, గుర్తు కేటాయిస్తామని ఇరు వర్గాలకు తెలిపింది. శుక్రవారం ఉదయం 11.00 గంటలలోపు మమత వర్గం, రెబల్ వర్గం.. తమ పార్టీ పేర్లు, గుర్తును సూచిస్తూ ఈసీకి తెలపాలని కోరింది. దీంతో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ వర్గం.. తమ పార్టీ పేరు, గుర్తును ఎంపిక చేసుకుంది. ఈ మేరకు ఈసీకి మెయిల్ ద్వారా సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది. వీటిని పరిశీలించనున్న ఈసీ.. మమత వర్గానికి, రెబల్ వర్గానికి వేర్వేరుగా పార్టీల పేర్లు, గుర్తులను కేటాయించనుంది. అయితే, ఈసీ నిర్ణయాన్ని మమతా బెనర్జీ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ పార్టీ గుర్తును తమకు కేటాయించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే, ఈ నిర్ణయాన్ని రెబల్ గ్రూప్ సమర్థించింది. అక్టోబర్ 6న పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఎన్నిక జరగనుంది. ఇప్పుడు ఈసీ కేటాయించే గుర్తుపైనే మమత వర్గం అయినా.. రెబల్ గ్రూప్ అయినా పోటీ చేయాలి. టీఎంసీ పేరు, పూలు-గడ్డి గుర్తు ఉండదు.

పిల్లల పాస్‌పోర్ట్‌పై కొత్త రూల్స్

-15 ఏళ్లలోపు వారికి ఐదేళ్లే వ్యాలిడిటీ
-18 ఏళ్ల వరకు మాత్రమే చెల్లుబాటు
-వయసును బట్టి తగ్గనున్న వ్యాలిడిటీ
-13 ఏళ్ల వయసులో తీసుకుంటే ఐదేళ్ల కాలపరిమితి
-18 ఏళ్లు దాటితే కొత్త పాస్‌పోర్ట్ తప్పనిసరి
-పిల్లల పాస్‌పోర్ట్‌లో 36 పేజీలే
-పాస్‌పోర్ట్ ఫీజుల్లోనూ మార్పులు



: దేశంలో పాస్‌పోర్ట్ రూల్స్ మారిపోనున్నాయి. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ కొత్త రూల్స్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం, సెప్టెంబర్ 17న విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. 15 ఏళ్లలోపు పిల్లలకు జారీ చేసే పాస్‌పోర్టు వ్యాలిడిటీ ఇకపై ఐదేళ్ల కాలపరిమితితోనే ఉంటుంది. అలాగే, 18 ఏళ్లు వచ్చే వరకు మాత్రమే వ్యాలిడిటీ కలిగి ఉంటుంది.18 ఏళ్ల తర్వాత జారీ అయ్యే పాస్‌పోర్టు మాత్రమే అదనపు వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. ఈ అంశంలో ఇప్పటికే ఉన్న పాస్‌పోర్ట్ రూల్స్, 1980 చట్టానికి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మార్పులు చేసింది. పాస్‌పోర్ట్స్ (అమెండ్‌మెంట్) రూల్స్, 2026 పేరిట కొత్త నిబంధనలతో గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి సంబంధించి సవరించిన రూల్ 12 (1ఏ) ప్రకారం.. 15 ఏళ్లలోపు వారికి 36 పేజీల పాస్‌పోర్టు జారీ చేస్తారు. 15 ఏళ్ల వయసులో తీసుకుంటే.. ఐదేళ్ల కాలపరిమితికి గాను 20 ఏళ్లు వచ్చే వరకు వ్యాలిడిటీ ఉండదు. గరిష్టంగా 18 ఏళ్ల వరకు మాత్రమే దీని వ్యాలిడిటీ ఉంటుంది. 13 ఏళ్లకు పాస్‌పోర్ట్ జారీ అయితే ఐదేళ్ల వ్యాలిడిటీతో 18 ఏళ్ల వరకు వాడుకోవచ్చు. అలాగే, 14, 15 ఏళ్లు అయితే.. గరిష్టంగా మరో నాలుగు, ఐదు సంవత్సరాల వ్యాలిడిటీ మాత్రమే వస్తుంది. 18 ఏళ్లు వచ్చిన వారు కొత్త పాస్‌పోర్టు తీసుకోవాల్సిందే. పిల్లలకు జారీ చేసే పాస్‌పోర్టులో గరిష్టంగా 36 పేజీలు మాత్రమే ఉంటాయి. పాస్‌పోర్టు దరఖాస్తు ఫీజులను ప్రభుత్వం ఇటీవల సవరించిన సంగతి తెలిసిందే. ఫీజులు పెంచుతూ అమెండ్‌మెంట్ రూల్ 8ను తీసుకొచ్చింది. దీనిపై ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది.

దానం నాగేందర్‌పై అనర్హత వేటు!

మొదటి తరువాయి

బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా పిటీషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలను ఆయన ఉల్లంఘించారని పిటీషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించినప్పటికీ.. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రిబ్యునల్ 2026 మార్చి 11న పిటీషన్లను తిరస్కరించిందని పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం చీఫ్ జస్టిస్ ధర్మాసనం స్పీకర్ నిర్ణయంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తాజా తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయాన్ని స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును తొలుత సెప్టెంబర్ 16న వెలువరించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

పాకిస్థాన్ మసీదులో ఆత్మాహుతి దాడి..

-ప్రార్థనలు చేస్తుండగా మసీదులో ఆత్మాహుతి దాడి
-ఖైదర్ పఖ్తుంఖ్వాలో ఘటన
-దాడిలో 21 మంది మృతి
-70 మందికి పైగా గాయాలు.. ఆస్పత్రుల్లో చికిత్స
-మృతుల్లో 15 మంది పోలీసులు
-క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమం
-సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ సిబ్బంది
-మృతుల సంఖ్య పెరిగే అవకాశం
-దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థా బాధ్యత ప్రకటించలేదు

ఇస్లామాబాద్



పాకిస్థాన్‌లోని ఖైదర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలోని ఓ మసీదులో శుక్రవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ దాడి జరగ్గా.. 21 మంది మృతి చెందారు. 70 మందికి పైగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్నారు.మృతుల్లో 15 మంది పోలీసులు కూడా ఉన్నారు.రెస్క్యూ సిబ్బంది సహాయక కార్యక్రమాలు చేపట్టారు. పలువురికి తీవ్రంగా గాయాలు కావడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ దాడిపై ఇప్పటి వరకు ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటన చేయలేదు.

రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తాం..

మొదటి తరువాయి

తూడి దేవేందర్‌రెడ్డి, గంప నాగేందర్, మోహన్‌రెడ్డి, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. మిల్లర్ల వినతులను సానుకూల దృక్పథంతో పరిశీలిస్తామని, ప్రభుత్వ పరిధిలో ఏమి చేయగలమన్న దానిపై అన్ని కోణాల్లో ఆలోచిస్తామని, మిల్లర్లపై అనవసర భారం మోపాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మిల్లర్ల ఇబ్బందులను సానుకూల దృక్పథంతో పరిశీలిస్తామని, మిల్లర్లు సమ్మెను విరమించాలని కోరారు.

బంద్ కొనసాగింపునకే మిల్లర్ల నిర్ణయం

ప్రభుత్వం ఎంత బుజ్జగించినప్పటికీ రైస్ మిల్లర్లు పట్టు వీడలేదు. తమ సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక బంద్‌ను కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గం అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉటూరి వీరేశం వెల్లడించారు.

ఆరు నూరైనా వెనక్కి తగ్గం!

మొదటి తరువాయి



అధికారిక రికార్డులు ఉన్నాయని తేల్చి చెప్పారు. సర్వే పూర్తయిన తర్వాత సాంకేతిక ఆధారాలతో వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు.

భూముల విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టదని, అయితే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రైవేట్ పట్టా భూములు, భౌతిక స్వాధీనం, రెవెన్యూ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లలో చూపిన ఆస్తుల మధ్య తేడాలు ఉంటే వాటిని రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిందేనని అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాలలో ఉన్న భూముల విషయంలో స్థానికుల నుంచి వచ్చిన సమాచారాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల్లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు సర్వేలో తేలితే, చట్టప్రకారం ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అర్హులైన పేదలకు, ముఖ్యంగా దళితులకు ఉపయోగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

2004 అఫిడవిట్‌లో భూములు లేవని చెప్పి.. ఇప్పుడు వందల ఎకరాలు ఎలా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ భూములపై జరుగుతున్న చర్యల్లో ఎన్నికల అఫిడవిట్‌లో నమోదుకాని వివరాలు కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వాములమని చెబుతున్నప్పుడు, ఆ భూముల వివరాలు సంబంధిత ఎన్నికల అఫిడవిట్‌లో ఎందుకు కనిపించలేదు? అని మంత్రి ప్రశ్నించారు. కేటీఆర్ కొడుకు పేరిట 40 ఎకరాల భూమిపై స్పందిస్తూ నూనూగు మీసాల పిల్లవాడు ఏ వ్యాపారం చేశాడని ఇంత భూమి వచ్చిందని మంత్రి ప్రశ్నించారు.

హరీశ్‌రావు అఫిడవిట్‌పైనా పరిశీలన

హరీశ్‌రావు తన ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన భూములు, ప్రస్తుతం ఉన్న భూములు, భౌతిక స్వాధీనం, ట్రస్ట్ పేర్లతో ఉన్న భూములు తదితర అంశాలను కూడా పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. అఫిడవిట్‌లో చూపిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమి ఉన్నట్లు తేలితే దాని చట్టబద్ధతను పరిశీలిస్తామని చెప్పారు. ఒక గుంట తేడా ఉన్నా అది ఎవరి పేరున, ఏ హక్కుతో ఉందో రికార్డుల ద్వారా తేలాలని అన్నారు. హరీశ్‌రావు కుటుంబ సభ్యులు మాజీ సైనికుడి నుంచి భూములు కొనుగోలు చేశారన్న వాదనపై కూడా మంత్రి స్పందించారు. భూమి లావాదేవీ జరిగితే దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, పట్టా, ఇతర చట్టబద్ధమైన డాక్యుమెంట్లు ఉండాలన్నారు. స్వాతంత్ర్యసమరయోధులు, మాజీ సైనికుల పేర్లతో జరిగిన భూ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను కూడా అధికారికంగా పరిశీలిస్తామని చెప్పారు. ఏదైనా పత్రం తప్పుదుదాని వర్గించే విధంగా ఉన్నట్లు తేలితే, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసైన్డ్ భూములకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ఉందని మంత్రి తెలిపారు. అసైన్డ్ భూముల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన అసైన్డ్ భూములపై ఒరిజినల్ పట్టాలు ఉన్నవారిని ఇబ్బంది పెట్టబోమని స్పష్టం చేశారు.

రంగనాయకసాగర్ భూముల వ్యవహారంపై రికార్డుల పరిశీలన

రంగనాయకసాగర్ పరిసర భూముల విషయంలో అప్పటి ఇరిగేషన్ శాఖ రికార్డులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించాల్సి ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. వట్టినాగులపల్లి భూమికి తనకు ప్రత్యక్షంగా యాజమాన్య సంబంధం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆ భూమి తనది కాదని, డెవలప్‌మెంట్ కోసం తీసుకున్నామన్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో ఉన్నానని, తన ప్రాజెక్టులకు అనుమతులు గత ప్రభుత్వాల సమయంలోనే వచ్చాయని తెలిపారు.

9.56 లక్షల ఇండ్లు కేటాయించండి

మొదటి తరువాయి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతోపాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలంటూ జూలైలో కేంద్రమంత్రికి చేసిన విజ్ఞప్తిని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. ఎల్‌నినో నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని గుర్తు చేశారు. వ్యవసాయ రంగంలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులకు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్స్, వెజిటెబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సెమీస్‌లో భారత్..

-క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌పై భారత్‌కు 8 వికెట్ల విజయం
-57 పరుగులకే జపాన్‌ను కుప్పకూల్చిన భారత బౌలర్లు
-తెలుగు తేజం శ్రీ చరిణి 4 వికెట్లతో సత్తా
-షెఫాలీ వర్మకు 2 వికెట్లు.. బ్యాటింగ్‌లోనూ మెరుపు ఇన్నింగ్స్
-15 బంతుల్లో 40 పరుగులతో షెఫాలీ వర్మ విధ్వంసం
-6 ఫోర్లు, 2 సిక్సర్లతో చెలరేగిన షెఫాలీ
-5 ఓవర్లలోనే 2 వికెట్లకు 59 పరుగులు చేసిన భారత్
-మరో 90 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించిన భారత్
-రిచా ఘోష్ 6 బంతుల్లో 12 నాటౌట్‌తో ఆకట్టుకుంది



నిస్సిన్ (జపాన్)

ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మెరుగైన ర్యాంక్‌తో నేరుగా క్వార్టర్‌ఫైనల్లో బరిలోకి దిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆతిథ్య జపాన్‌ను చిత్తు చేసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో 58 పరుగుల లక్ష్యాన్ని మరో 90 బంతులు ఉండగానే 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఛేదనలో ఓపెనర్ షెఫాలీ వర్మ (40 నాటౌట్, 15 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచికొట్టింది. కమిలిని (0), భార్తి (6) నిరాశపరిచారు. రిచా ఘోష్ (12 నాటౌట్, 6 బంతుల్లో 2 ఫోర్లు) ఆకట్టుకుంది. 5 ఓవర్లలో 2 వికెట్లకు 59 పరుగుల చేసిన భారత్ ఆడుతూ పాడుతూ సెమీస్‌కు చేరుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్ 19.5 ఓవర్లలో 57 పరుగులకు కుప్పకూలింది. తెలుగు తేజం శ్రీ చరిణి (4/10), షెఫాలీ వర్మ (2/13) మాయ చేశారు. జపాన్ తరఫున ఓపెనర్లు అయాక (25), హరుణ (10) మాత్రమే రెండెంకల స్కోర్లు సాధించారు.

యూపీఐ చార్జీలతో అమెరికా కంపెనీలకే లబ్ధి!



న్యూఢిల్లీ : రూ.2,000 పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4% మర్చంట్ ఫీజు వసూలు చేయాలన్న మోదీ సర్కార్ ప్రణాళిక ఎక్కువగా అమెరికా కంపెనీలకే లబ్ధి చేకూర్చనున్నది. వాణిజ్య నిపుణుల ప్రకారం.. ఈ ఫీజు అమెరికా కంపెనీ వాల్‌మార్ట్‌కు చెందిన ఫోన్ పేకు కొత్త ఆదాయ వనరును సృష్టించడంతోపాటు త్వరలో చేపట్టనున్న ఐపీవోకు ముందు దాని విలువను పెంచే అవకాశం ఉన్నది. భారత్ ఉచిత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, రూపే నెట్‌వర్క్ తమకు ప్రతికూలంగా మారాయని అమెరికా కంపెనీలు చాలాకాలంగా వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా ఈ చర్య కొంతవరకు తగ్గించవచ్చు. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్(జీటీఆర్ఐ) పేర్కొన్న అంచనాల ప్రకారం.. యూపీఐ లావాదేవీల్లో 80 శాతానికి పైగా ఫోన్ పే, గూగుల్ పే కలిపి నిర్వహిస్తున్నాయి.

అందువల్ల ఈ మార్పు ముఖ్యంగా ఈ రెండు సంస్థలకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉన్నది. అయితే దీని ప్రభావం యూపీఐ ఆపరేటర్లకే పరిమితం కాదు. అంతర్జాతీయ కార్డ్ నెట్‌వర్క్‌లైన వీసా, మాస్టర్‌కార్డ్ పోటీ స్థితిని కూడా ఈ మార్పు మెరుగుపరచవచ్చని జీటీఆర్ఐ వాదిస్తున్నది. యూపీఐతో పోలిస్తే కార్డ్ చెల్లింపులపై ఉండే వ్యయ వ్యత్యాసం తగ్గడమే దీనికి కారణమని చెప్తున్నది. క్రెడిట్ కార్డుకు ఎండీఆర్ 1.5% నుంచి 2.5% వరకు, డెబిట్‌కార్డుకు 0.9% వరకు ఉన్నది. కొత్త యూపీఐ రేటు 0.4% క్రెడిట్, డెబిట్ కార్డుల ఎండీఆర్ కంటే తక్కువగా ఉన్నది. భారత్‌లో సున్నా ఖర్చుతో కూడిన యూపీఐ వ్యవస్థ, చెల్లింపుల మార్కెట్‌లో రూపే స్థానం కలిసి వీసా, మాస్టర్‌కార్డ్ వంటి అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ఇప్పటివరకు ప్రతికూల స్థితితో ఉంచాయని థింక్‌ట్యాంక్ చెప్తున్నది. అయితే యూపీఐపై చార్జీలు విధించడం కార్డ్ నెట్‌వర్క్‌ల పోటీ సమీకరణాన్ని మారుస్తుందని జీటీఆర్ఐ తెలిపింది.

విదేశీల కంపెనీలకు అదనపు ఆదాయం!

ఈ నిర్ణయంపై అమెరికా ఒత్తిడి ప్రభావం చూపిందన్న వాదనలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తిరస్కరించారు. కొత్త విధానం స్థిరమైన చెల్లింపుల వ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అయితే భారతదేశపు పబ్లిక్ డిజిటల్ పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగిస్తున్న విదేశీ యాజమాన్యంలోని టెక్నాలజీ కంపెనీలకు అదనపు ఆదాయాన్ని సృష్టించడానికి భారతీయ వ్యాపారులు, వినియోగదారులు సహాయపడాలా అని జీటీఆర్ఐ ప్రశ్నించింది. యూపీఐని భారతీయ ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు అభివృద్ధి చేశాయని, అయితే జీటీఆర్ఐ పేర్కొన్న అంచనాల ప్రకారం ఇప్పుడు ఫోన్ పే, గూగుల్ పే కలిపి 80 శాతానికి పైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్నాయని థింక్ ట్యాంక్ పేర్కొన్నది. ప్రభుత్వ మౌలిక సదుపాయాలను ఉపయోగిస్తున్న విదేశీ ప్లాట్‌ఫామ్‌లపై భాగస్వామ్య రుసుం విధించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని జీటీఆర్ఐ వాదిస్తున్నది. భవిష్యత్తులో ఇతర యూపీఐ లేదా రూపే లావాదేవీలకు కూడా ఫీజులను విస్తరించే అవకాశం ఉన్నదని చెప్తున్నది.

జీటీఆర్ఐ, భారతీయ ఫిన్‌టెక్ ప్రచురణ సంస్థ పేర్కొన్న అంచనాల ప్రకారం ఫోన్ పే యూపీఐ లావాదేవీల్లో 45 శాతం నిర్వహిస్తుండగా, గూగుల్ పే సుమారు 35 నుంచి 40 శాతం వరకు వాటాను కలిగి ఉన్నది. ఈ అంచనాల ప్రకారం లావాదేవీల పరిమాణంలో ఈ రెండు ప్లాట్‌ఫామ్‌లు కలిపి 80 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయి. ఫోన్ పేలో సుమారు 70 శాతం వాటా వాల్‌మార్ట్‌ది కాగా, గూగుల్ పేకు అమెరికాకు చెందిన గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ యజమాని. కొత్త ఎండీఆర్ వల్ల ఇంతకుముందు తక్కువ లేదా ఎలాంటి మర్చంట్ ఫీజు ఆదాయం రాని లావాదేవీల నుంచి చెల్లింపు యాప్‌లు ఆదాయం పొందే అవకాశం ఏర్పడుతున్నది. అయితే 0.4% మొత్తాన్ని చెల్లింపు యాప్‌లు పూర్తిగా తమ వద్ద ఉంచుకోవు. ఎండీఆర్‌ను బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థలోని ఇతర భాగస్వాముల మధ్య పంచుతారు. గతంలో పరిశ్రమ అంచనాల ప్రకారం, థర్డ్ పార్టీ పేమెంట్ ప్రొవైడర్లకు సుమారు 30 శాతం, మిగిలిన మొత్తాన్ని జారీ చేసే బ్యాంకులు, అక్వైరింగ్ బ్యాంకులు పొందవచ్చని అంచనాలు ఉన్నాయి. అయితే ఫోన్ పేకు భారీ లావాదేవీల ఆధారంగా లభించే ఆదాయ పూల్‌లో కొంతభాగం కూడా ఆర్థికంగా గణనీయంగా మారవచ్చు.

వినియోగదారులపై భారం ఉండదా?

2026 ఆగస్టులో యూపీఐ 2,451 కోట్ల లావాదేవీలను ప్రాసెస్ చేసింది. వీటి విలువ రూ.29.9 లక్షల కోట్లు. ఈ లావాదేవీల్లో కొంత భాగంపై చిన్న మొత్తంలో ఫీజు విధించినా అది గణనీయమైన ఆదాయాన్ని సృష్టించే అవకాశం ఉన్నది. పరిశ్రమ, బ్రోకరేజ్ సంస్థల అంచనాల ప్రకారం.. వ్యవస్థ పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాత వార్షిక ఎండీఆర్ ద్వారా సుమారు రూ. 16,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్ల వరకు ఆదాయ పూల్ ఏర్పడే అవకాశం ఉన్నది.

చెరువుకు కాలుష్య గండం లేకుండా..

-వినాయక నిమజ్జనానికి దేవరకద్రలో ప్రత్యామ్నాయ మార్గం

-చిన్న, మధ్య తరహా విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కుంట ఏర్పాటు



దేవరకద్ర నియోజకవర్గం సెప్టెంబర్ 18 మహాప్రభ

దేవరకద్ర: వినాయక నిమజ్జనం అంటే సంబరమే కాదు.. పర్యావరణ పరిరక్షణ కూడా. విగ్రహాల నిమజ్జనం కారణంగా చెరువులు, కుంటల్లో నీటి కాలుష్యం పెరగకుండా దేవరకద్ర మున్సిపాలిటీ వినూత్న చర్యకు శ్రీకారం చుట్టింది. చిన్న, మధ్య తరహా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం పట్టణంలో ప్రత్యేకంగా కృత్రిమ కుంటను సిద్ధం చేసింది. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు ఈ ఏర్పాట్లు చేపట్టారు. దేవరకద్రలోని ప్రభుత్వ బాలికల పాఠశాల వెనుక ఉన్న వెంచర్ పార్కు స్థలంలో సుమారు 20 అడుగుల వెడల్పు, 30 అడుగుల పొడవు, 10 అడుగుల లోతుతో కృత్రిమ కుంటను నిర్మించారు. కుంటలోని నీరు భూమిలోకి ఇంకిపోకుండా ప్రత్యేకంగా కవర్లు ఏర్పాటు చేసి, ట్యాంకర్ల ద్వారా నీటిని నింపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు నుంచి ఐదు అడుగుల ఎత్తు కలిగిన వినాయక విగ్రహాలను ఈ కృత్రిమ కుంటలోనే నిమజ్జనం చేయాలని మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి ప్రజలకు సూచించారు.

చెరువులపై భారం తగ్గించేందుకే..

వినాయక విగ్రహాలకు వినియోగించే రంగులు, ఇతర పదార్థాలు నిమజ్జనం సమయంలో నీటిలో కలవడంతో చెరువులు, కుంటల్లో కాలుష్యం ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల నీటిపై ఆధారపడే పశుపక్ష్యాదులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉండటంతో ప్రత్యామ్నాయంగా కృత్రిమ కుంటను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగుతూనే.. జల వనరుల పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన కృత్రిమ కుంటను వినియోగించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

విలేకరి కుటుంబానికి కాంగ్రెస్ భరోసా

-కన్నీటి కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్

-నాయకులు -- రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత



పెద్దవంగర సెప్టెంబర్ 18 (మహాప్రభ)

మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన విలేకరి చింతల ఐల్లయ్య ఇటీవల మృతిచెందారు విషయం తెలుసుకున్న పెద్దవంగర మండల కాంగ్రెస్ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు మురళి ఆధ్వర్యంలో నాయకులు మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మానవతా దృక్పథంతో రూ.5,000 ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి. హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు పొడిసెట్టి సైదులు, శ్రీనివాస్, మోహన్‌రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జీవో 97కు వ్యతిరేకంగా పాలిటెక్నిక్ విద్యార్థుల చలో ఇందిరా పార్క్'కు అనుమతి నిరాకరణ

-నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో పోలీసుల చర్య

-ప్రభుత్వ తీరును ఖండించిన పాలిటెక్నిక్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, ఐఖీ వ్యవస్థాపకులు ఎరవెల్లి జగన్

-త్వరలో మరో తేదీన ధర్నా నిర్వహిస్తామని ప్రకటన



హైదరాబాద్ సెప్టెంబర్ 18,(మహాప్రభ)

తెలంగాణ పాలిటెక్నిక్ విద్యను కొత్తగా ప్రతిపాదించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97 (GO 97) ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ సెప్టెంబర్ 18న (రేపు) హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టతలపెట్టిన "చలో ఇందిరా పార్క్" మహాధర్నాకు శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు అనుమతి నిరాకరించారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ మరియు నిఘా వర్గాలు అందించిన సమాచారం ప్రకారం.. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల నుండి సుమారు 5,000 నుండి 6,000 మంది విద్యార్థులు భారీ సంఖ్యలో ఈ ధర్నాకు తరలివచ్చే అవకాశం ఉంది. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకేచోట చేరితే నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని భావించిన పోలీస్ యంత్రాంగం ఈ నిరసన కార్యక్రమానికి పర్మిషన్ నిరాకరించింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల తీరును పాలిటెక్నిక్ జేఏసీ చైర్మన్ ఎరవెల్లి జగన్, కన్వీనర్ జనార్దన్ తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ధర్నా చేసి తమ నిరసన తెలుపుతామని పలుమార్లు పోలీసు అధికారులకు జేఏసీ ప్రతినిధులు తెలిపినా...ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు.

రామాయంపేట మున్సిపాలిటీ పరిధి తొమ్మిదో వార్డు భారీ వినాయకుని వద్ద పూజా కార్యక్రమాలు



రామాయంపేట, సెప్టెంబర్ 18 (మహాప్రభ)

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డులో ఏర్పాటు చేసిన భారీ వినాయకుని విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పూజా కార్యక్రమం అనంతరం గణేష్ మండపం వద్ద చిన్నారులు ఆటపాటలు, కోలాటాలతో సందడి చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలి!!





ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించడం అధికారుల బాధ్యత : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

వనపర్తి సెప్టెంబర్ 18 (మహాప్రభ)

జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సామాజిక, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్సీ,ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. శుక్రవారం వనపర్తి జిల్లాకు విచ్చేసిన ఆయనకు కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి పూల మొక్కలు ఇచ్చి స్వాగతం పలకగా, పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో ఆయన వివిధ శాఖల అధికారులతో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించడం అధికారుల బాధ్యత అని చైర్మన్ తెలిపారు. అర్జీదారుల పట్ల మర్యాదగా వ్యవహరించి, వారి వినతులను సావధానంగా విని, నిబంధనల ప్రకారం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై నమ్మకం కలిగే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. పోలీసు శాఖకు సంబంధించిన అంశాలపై సమీక్షిస్తూ ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు చట్ట ప్రకారం వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులను పెండింగ్లో ఉంచకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. కేసుల దర్యాప్తు, పరిహారం ప్రక్రియలో సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎఫ్ఎస్ఎల్ (ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ)కు సంబంధించిన కేసులు పెండింగ్లో లేకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సులభతరంగా, నిబంధనల ప్రకారం పరిష్కరించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఎస్పీకి సూచించారు. జిల్లాలో వివిధ కేసుల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన బాధితులకు అందాల్సిన పరిహారం, సహా విదేశీ విద్యకు సంబంధించిన పరిహారం, కులాంతర వివాహం చేసుకున్న వారికి అందాల్సిన పరిహారం తదితర ప్రయోజనాలు పెండింగ్ లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా పరిహారాలు పెండింగ్లో ఉంటే వాటి వివరాలను తనకు నివేదిక రూపంలో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి తో జరిగే సమావేశంలో చర్చించి నిధుల విడుదలకు చొరవ తీసుకుంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, విద్యా, ఉపాధి పథకాలపై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలు, పబ్లిక్ స్కూళ్లలో సీట్లు, ఉన్నత విద్య, విదేశీ విద్యకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, భూమి ఆధారిత పథకాలు, ఇతర సంక్షేమ పథకాల వివరాలను అర్హులైన వారికి తెలియజేసి వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు సహకరించాలని సూచించారు.

రిజర్వేషన్లు, రోస్టర్ విధానం పక్కాగా అమలు చేయాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన రిజర్వేషన్ నిబంధనలు, రోస్టర్ విధానం, రిజర్వేషన్ రిజిస్టర్లను నిబంధనల ప్రకారం నిర్వహించాలని చైర్మన్ ఆదేశించారు. రిజర్వేషన్ల అమలులో ఎలాంటి అవకతవకలకు, అన్యాయానికి అవకాశం లేకుండా జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్దేశిత ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించేలా అధికారులు పర్యవేక్షించాలని, నిధులు పక్కదారి పట్టేందుకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. నిధుల వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా నిధులను ఇతర సాధారణ అవసరాలకు లేదా సంబంధం లేని కార్యక్రమాలకు మళ్లించి ఖర్చు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించిన నిధులు పక్కదారి పడితే సంబంధిత అధికారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని, నిధుల వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి కేటాయించబడే నిధులు, పథకాల ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేటాయించిన బడ్జెట్‌కు అనుగుణంగా నిధులను సక్రమంగా వినియోగిస్తూ, అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులకు సూచించారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని తెలిపారు.

అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల నియామకాల్లో ఎస్టీలకు కూడా తగిన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన భద్రతా పరికరాలు, రక్షణ కల్పించడంతో పాటు వారికి జీతాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్మికులకు సంబంధించి ఏవైనా పెండింగ్ బకాయిలు ఉంటే వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో అటవీ భూములకు సంబంధించిన సమస్యలపై ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రితో సమావేశం ఉన్నందున, జిల్లాలోని అటువంటి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని చైర్మన్ సూచించారు. ఆయా సమస్యలను సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వనపర్తిలో అంబేద్కర్ కళాభవనం ఏర్పాటు చేయాలనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు చేపడతామని తెలిపారు.

జిల్లాలో స్వంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను సేకరించి, కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు, నివేదికలను సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వి బి జి రామ్ జి కింద కొత్త భవనాలు మంజూరయ్యేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత నిధుల ద్వారా నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి నెల తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ఇందులో తహసీల్దార్లతో పాటు ఎస్ఐలు, ఇతర సంబంధిత అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలు, కేసుల పురోగతిని సమీక్షించాలని తెలిపారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మణ్, రాంబాబు నాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీ రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిరాజుద్దీన్, సామాజికవేత్త గంధం నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్రాగు నీటి కోసం .. అనంత లోకానికి



పాపన్నపేట, సెప్టెంబర్ 18(మహా ప్రభ)

త్రాగు నీటి కోసం వెళ్ళి ప్రమాద వశత్తు బోరు బావి పై పడి విద్యుత్ షాక్ గురై మహిళ మృతి చెందిన సంఘటన చీకోడ్ లో శుక్రవారం వెలుగు చూసింది.

పోలీసులు,కుటింబీకుల సమాచారం మేరకు.. బద్దం శోభరాణి (51) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం తమ వ్యవసాయ క్షేత్రంలో పనులు చేపట్టెందుకు వెళ్ళి పొద్దాస్తమానం పని చేస్తూ అలిసిపోయి గొంతు తడుపు కునేందుకు త్రాగు నీటి కోసం ప్రక్కనే ఉన్న మరొకరి వ్యవసాయ క్షేత్రం లోని బోరుబావి వద్దకు చేరుకొని నీరు త్రాగెందుకు వెళ్ళి ప్రమాద వశత్తు బోరు బావి పై పడడంతో విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే కుటింబికులకు సమాచారం అందివ్వడంతో కుటింబికులు వెళ్ళి వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందివ్వడంతో పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి కుమారుడు సంపత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

ఉత్సవాలకు వేలం పాట ..



పాపన్నపేట, సెప్టెంబర్ 18 (మహా ప్రభ)



మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ దేవస్థాన కార్యాలయంలో ఒక్క సంవత్సరం కాలపరిమితి గాను సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. 1. శ్రీ దేవి శరన్నవరాత్రులలో గోకుల్ షెడ్ నందు డెకరేషన్,విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేయుటకు,వంట సామాగ్రి సరఫరా చేయుటకు రూ. 1 లక్ష 75 వేలకు ణ. వినీత్ అన్నారం పాపన్నపేట హక్కు పొందారు. 2. మనీ వాల్యూ రసీదు పుస్తకములు ప్రింటింగ్ సరఫరా చేయుటకు రూ.2 వేల 7 వందల 94 శ్రీ రామ్ ప్రింటర్స్ మెదక్ హక్కు పొందారు. 3. కూరగాయలను సరఫరా చేయుటకు రూ. 1 వేయి 2 వందల 10 రూపాయలు దీ. భవాని ప్రసాద్ మెదక్ హక్కు పొందారు. 4. దేవస్థానం వద్ద ఇనుప సామాగ్రి కొనుగోలు చేయుటకు రూ. 1 వేయి 8 వందల 85 రూపాయలకు బి. దాదయ్య మెదక్ హక్కు పొందారు. మిగతా టెండర్లు సరైన హెచ్చు పాట రానందున వాయిదా వేశారు. ఈకార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీరేశం,సిబ్బంది శ్రీనివాస్,టెండరు దారులు పాల్గొన్నారు.

ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

దేవరకొండ సెప్టెంబర్ 18 (మహాప్రభ)
అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి -- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్.. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో త్వరలో నిర్వహించనున్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో పోటీ పడుతున్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన 500 మంది నిరుద్యోగ యువతి, యువకులను ఎంపిక చేసి, నల్లగొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో వారికి ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అభ్యర్థులకు పోలీస్ నియామక పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన శారీరక దారుఢ్య శిక్షణ (ఫిజికల్ ట్రైనింగ్), రాత పరీక్షకు సంబంధించిన సిలబస్‌పై బోధన, మాక్ టెస్టులు, పరీక్షా విధానంపై అవగాహన, నిపుణుల మార్గదర్శకత్వం తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే ఎంపికైన అభ్యర్థులకు వసతి, భోజన సౌకర్యాలను కూడా ఉచితంగా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన శిక్షకులు, నిపుణుల ఆధ్వర్యంలో అభ్యర్థులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందిస్తూ, రాత



పరీక్షతో పాటు ఫిజికల్ ఈవెంట్లలో కూడా మెరుగైన ప్రతిభ కనబరిచేలా అభ్యర్థులను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలనుకునే అభ్యర్థులు కింది గూగుల్ ఫామ్ లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు:
https://forms.gle/Ha8ZK33Y1emVCKmx6
అలాగే ఎస్ఐ/కానిస్టేబుల్ నియామక ప్రక్రియకు దరఖాస్తు చేసుకున్న పార్ట్ వన్ అప్లికేషన్ ఫామ్స్ ప్రతిని వెంట తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు తేది 20-09-2026 ఆదివారం ఉదయం 9.00 గంటలకు ముందుగానే క్రింది కేంద్రాల్లో సంబంధిత సబ్ డివిజన్ అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుని,స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలనీ జిల్లా ఎస్పీ సూచించారు. నల్లగొండ సబ్ డివిజన్ అభ్యర్థులు: ఎన్.జి. కళాశాల, నల్లగొండ
మిర్యాలగూడ సబ్ డివిజన్ అభ్యర్థులు: మీనా ఇంజినీరింగ్ కళాశాల, మిర్యాలగూడ
దేవరకొండ సబ్ డివిజన్ అభ్యర్థులు:కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మీనాక్షి సెంటర్స్, డిండి క్రాస్ రోడ్
నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ అందిస్తున్న ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగం సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆకాంక్షించారు. ఏదైనా సందేహాలు ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్లో వివరాలు అడిగి తెలుసుకోగలరని తెలిపారు.

న్యాయమే గెలిచింది

-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ సెప్టెంబర్ 18 (మహాప్రభ)
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడం బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన న్యాయపోరాటానికి ఫలితమని బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.పార్టీ ఫిరాయింపులపై రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా వ్యవహరించిన వారికి ఈ తీర్పు ఒక గుణపాఠమని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి, అనంతరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన దానం



నాగేందర్‌పై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయని, స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు.తెలంగాణ హైకోర్టు శుక్రవారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ తీర్పు ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్య విలువలకు బలం చేకూర్చిందని రవీంద్ర కుమార్ అన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఆయన అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.“ప్రజల తీర్పును, పార్టీ గుర్తుపై వచ్చిన విజయాన్ని గౌరవించాలి. పదవుల కోసం పార్టీలు మారడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఫిరాయింపు రాజకీయాలకు ఈ తీర్పు ఒక హెచ్చరిక. న్యాయమే గెలిచింది.. రాజ్యాంగమే నిలిచింది” అని రవీంద్ర కుమార్ అన్నారు.బీఆర్ఎస్ పార్టీ న్యాయపోరాటం భవిష్యత్తులో కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

మెదక్ రేయన్ బో ఆసుపత్రిలో ప్రత్యేక ఆరోగ్య పథకాల ప్రారంభం

ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఉచిత వైద్య పరీక్షలు. మందులు, ఇతర వైద్య ఖర్చులపై 50% శాతం వరకు రాయితీ

మెదక్ జిల్లా -18సెప్టెంబర్ (మహాప్రభ).
మెదక్ పట్టణంలోని అజాంపుర ప్రాంతంలో ఉన్న రెయన్ బో మదర్ అండ్ చైల్డ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ఆరోగ్య పథకాలను పర్సన్ మల్టీ ఆసుపత్రిని కానుగు రాధిక భూపతిరాజ్ ప్రారంభించారు. ఆసుపత్రి బాధ్యులు మహ్మద్ ఫరీద్ అహ్మద్ ఖాన్ నదీమ్, మహ్మద్ బుర్హానుద్దీన్ ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రిని ప్రారంభోత్సవం చేశారు..ప్రస్తుతం చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా ఆసుపత్రులను ఆశ్రయించే ప్రజలు వైద్య పరీక్షలు, మందులు, ఇతర వైద్య సేవల సరసమైన ధరలో ఫీజులు అందుబాటులో ఉంటుందని తెలిపారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రేయన్ బో ఆసుపత్రి



ప్రత్యేక ఆరోగ్య పథకాలను ప్రవేశపెట్టింది.ఈ పథకాలలో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జనరల్ ఫిజిషియన్, పీడియాట్రిక్, గైనకాలజిస్ట్ నిపుణుల వైద్య సేవలు పరీక్షలు అందించనున్నారు. అదేవిధంగా మందులు మరియు ఇతర సంబంధిత వైద్య ఖర్చులపై 50 శాతం వరకు రాయితీ అందించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.ఈ ప్రత్యేక ఆరోగ్య పథకాలను మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగో రాధిక భూపతిరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే విధంగా రెయిన్ బో ఆసుపత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఆరోగ్య రంగంలో ప్రజలకు అందుబాటులో ఉండే ఇలాంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మెదక్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డి. నరేష్ గౌడ్ మాట్లాడుతూ రైన్బో ఆసుపత్రి ప్రారంభించిన ప్రత్యేక ఆరోగ్య పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని అవసరమైన వైద్య సేవలను పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు మహ్మద్ జుబేర్ అహ్మద్, మహ్మద్ మన్సూర్, మహ్మద్ ఇమ్రాద్ అలీ, శేఖర్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ తాహెర్ అలీ, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అంజలి, డాక్టర్ గౌతమ్లను ఘనంగా సన్మానించారు. ప్రజలు రేయన్ బో ఆసుపత్రి అందిస్తున్న ప్రత్యేక ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకుని వైద్య సేవలను పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.అనంతరం ఆసుపత్రి బాధ్యులు మహ్మద్ ఫరీద్ అహ్మద్ ఖాన్ నదీమ్ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ ప్రజాప్రతినిధులు, వైద్యులు, అతిథులు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహాగణపతి సన్నిధిలో భక్తిశ్రద్ధలు

-అనారోగ్య కార్యకర్తకు భాస్కర్ రెడ్డి ఆర్థిక చేయూత

దేవరకద్ర నియోజకవర్గం సెప్టెంబర్ 18 మహాప్రభ
దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని దేవరకద్ర గ్రామంలో కొలువుదీరిన మహాగణపతి పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సోదరుడు జి. భాస్కర్ రెడ్డి హాజరై మహాగణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి భాస్కర్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు.



అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. పూజా కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న భాస్కర్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. సదరు కార్యకర్తకు వైద్య చికిత్స అవసరమని తెలుసుకుని, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో ఉన్న కార్యకర్తకు అండగా నిలిచి వైద్యానికి ఆర్థిక చేయూత అందించడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దేవరకొండ పట్టణంలో 17 వ వార్డులో ఘనంగా గణేష్ చవితి ఉత్సవాలు





దేవరకొండ సెప్టెంబర్ 18 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలోని 17వ వార్డులో శ్రీ గణేష్ చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా, వైభవంగా జరిగింది. గణనాథుని నవరాత్రి మహోత్సవాలలో భాగంగా వార్డు ప్రజలు, స్థానిక యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు అత్యంత శ్రద్ధాసక్తులతో ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు ముఖ్య అతిథులుగా దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ మరియు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ దైవకార్యంలో భాగస్వాములవుతూ శ్రీ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు రూ. 16,115/- (పదహారు వేల నూట పదిహేను రూపాయలు) నగదు విరాళాన్ని అందజేశారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటూ తన ఉదారతను చాటుకున్న నేనావత్ కిషన్ నాయక్ కి ఉత్సవ నిర్వాహకులు, 17వ వార్డు ప్రజలు, భక్తజనాలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ , నాయకులు కిషన్ నాయక్ మాట్లాడుతూ... భక్తిభావాన్ని ప్రచారంలోకి తీసుకురావడంతో పాటు, ప్రజలందరూ కలిసికట్టుగా పండుగలను జరుపుకోవడం మన సాంప్రదాయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని కొనియాడారు. భక్తులందరికీ శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:గిరిజన సోదరులు, కాలనీవాసులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అన్నదానంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కుంకుమార్చనలో సందడి.. మహిళకు తులం వెండి బహుమతి





రామాయంపేట, సెప్టెంబర్ 18 మా ప్రభ
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలకు ప్రత్యేకంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న 24 మంది మహిళలకు డ్రా నిర్వహించగా ఒక మహిళ కు తులం వెండి బహుమతిని గెలుచుకున్నారు. బహుమతి దక్కడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దామోదర్ రావు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు కౌన్సిలర్లు , గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బాపనయ్య తండా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ

- సర్పంచ్ తార్యా నాయక్



రామాయంపేట, సెప్టెంబర్ 18 మహాప్రభ
రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపనయ్య తండా ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ తార్యా నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం యూనిఫామ్ దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి యూనిఫామ్‌లు అందించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ తార్యా నాయక్‌ను గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ముందుంటామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కట్ట ఈశ్వర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, ఉపాధ్యాయురాలు ఎన్.రజిత, రెడ్డిశెట్టి శేఖర్, కాముని సంతోష్, దప్పు భూదయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రంగం సిద్ధం!!

-రూ.11.75 కోట్లతో సెమీ రెసిడెన్షియల్ విధానంలో అత్యాధునిక పాఠశాల ఏర్పాటు!!

-అంతర్జాతీయ విద్యా ప్రమాణాలే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు!!

-ఎమ్మెల్యే మేఘారెడ్డి





అనపర్తి సెప్టెంబర్ 18 (మహాప్రభ)
గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కూడా ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణల్లో భాగంగా పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది రూ.11.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ పాఠశాల ద్వారా గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు, మెరుగైన బోధనా విధానాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి శుక్రవారం వెల్టూరు గ్రామాన్ని సందర్శించి తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలను అధికారులతో చర్చించి, విద్యార్థులకు అన్ని విధాలా అనుకూలంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ప్రభుత్వ బడుల్లోనే ప్రపంచస్థాయి విద్య ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు మాత్రమే పరిమితమైన అధునాతన విద్యా ప్రమాణాలు ఇక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా అందుబాటులోకి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను సెమీ రెసిడెన్షియల్ విధానంలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ముందుకు సాగుతోందనీ ఎమ్మెల్యే పేర్కొన్నారు విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు క్రీడలు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర విద్య అందించేలా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు సులభంగా చేరుకునేలా ప్రత్యేక బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించే విధానాన్ని కూడా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు విదేశీ విద్యా విధానాలపై మన ఉపాధ్యాయులకు ప్రత్యక్ష అవగాహన తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనను మరింత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి, అక్కడి విద్యా వ్యవస్థ, బోధనా పద్ధతులు, సాంకేతిక వినియోగం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం కల్పిస్తున్నారు. విదేశాల్లో అమలవుతున్న ఉత్తమ విద్యా విధానాలను అధ్యయనం చేసి, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.ఒక్కో విద్యార్థికి సుమారు రూ.1,400 విలువైన కిట్‌ను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా, తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గేలా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన బోధన, ఆధునిక మౌలిక వసతులు, రవాణా సౌకర్యం, విద్యా సామగ్రి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి---ఇవన్నీ కలిపి విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల ప్రధాన ఉద్దేశంగా నిలుస్తోంది. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారితో సెల్ఫీలు దిగి విద్యార్థులతో కాసేపు ఉల్లాసంగా గడపడం ఎంతగానో ఆకట్టుకుంది కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, యువకులు, పెద్దలు గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

గణనాథులను ప్రత్యేకంగా దర్శించుకున్న శివసేన రెడ్డి..

-దిబిపలు మండపాల్లో ప్రత్యేక పూజలు.. వేద మంత్రోచ్ఛరణలు, డప్పు మేళాలతో ఘన స్వాగతం



సెప్టెంబర్ వనపర్తి 18 (మహాప్రభ)
వినాయక చవితి ఉత్సవాలతో వనపర్తి జిల్లా కేంద్రం భక్తిశ్రద్ధలతో కళకళలాడుతోంది. వివిధ వార్డులు, కాలనీల్లో కొలువుదీరిన గణనాథుల మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో వనపర్తి డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని 12వ వార్డు, 32వ వార్డు, 30వ వార్డులతో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు వెళ్లి గణనాథులను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించారు. శివసేన రెడ్డి ఆయా మండపాల వద్దకు చేరుకున్న సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, డప్పు మేళాల నడుమ ఆయనను మండపాల వద్దకు తీసుకెళ్లారు. పలుచోట్ల పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని గణనాథుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులతో శివసేన రెడ్డి ఆత్మీయంగా మాట్లాడి ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పూజా కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఉత్సవాల్లో యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటుండటంతో ఆయా ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహిస్తుండటంతో మండపాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రాత్రివేళ విద్యుత్ దీపాలంకరణలతో మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వివిధ వార్డుల్లో స్థానిక యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పలుచోట్ల భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గణనాథుడి ఆశీస్సులతో వనపర్తి ప్రజలకు శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు కలగాలని శివసేన రెడ్డి ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, పట్టణ అధ్యక్షులు కదిరే రాములు యాదవ్, ఒబిసి నాయకులు చంద్రమౌళి, వైస్ చైర్మన్ మధుసూదన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు క్రాంతి కుమార్ గౌడ్, నక్క రాజు,యూత్ కాంగ్రెస్ నాయకులు శివ కుమార్ నాయుడు, అరవింద్ నాయక్, తిరుపతి నాయక్, పలువురు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర విద్య.

-రైతులకు మెరుగైన మార్కెట్ సేవలు

-పెబ్బేరులో నూతన భవిత కేంద్రం, మార్కెట్ యార్డు అదనపు కార్యాలయ గదులు ప్రారంభం!!

-విద్య, వ్యవసాయ రంగాల మౌలిక వసతుల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యం!!

-విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు అవసరమైన సహాయ సేవలు అందించడం!!





వనపర్తి సెప్టెంబర్ 18 (మహాప్రభ)
రైతులకు మార్కెట్ యార్డుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం పెబ్బేరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని నూతన నిర్మాణాలను ప్రారంభించారు. పెబ్బేరు పాఠశాలలో నిర్మించిన నూతన భవిత కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.
ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారి సామర్థ్యాలకు అనుగుణంగా విద్య, శిక్షణ, అవసరమైన సహాయక సేవలు అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది. స్పీచ్, ఫిజియోథెరపీ, కమ్యూనికేషన్, స్వయం ఆధారిత నైపుణ్యాలతో పాటు పాఠశాల విద్యకు అనుసంధానం చేసే విధంగా అవసరమైన సహకారం అందించేందుకు భవిత కేంద్రం దోహదపడుతుంది.
ప్రతి చిన్నారికి సమాన విద్యా అవకాశాలు కల్పించి, వారి ప్రతిభను వెలికితీయడమే సమగ్ర విద్య లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు పరిపాలనా వ్యవస్థ కోసం నిర్మించిన అదనపు కార్యాలయ గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.44 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ నిర్మాణాలతో మార్కెట్ యార్డు పరిపాలనా కార్యకలాపాలకు అదనపు వసతులు అందుబాటులోకి వచ్చాయి. అధికారులు, సిబ్బంది విధులను మరింత సౌకర్యవంతంగా నిర్వహించడంతో పాటు రైతులు, వ్యాపారులకు అవసరమైన సేవలను మెరుగ్గా అందించేందుకు ఈ భవనం ఉపయోగపడనుంది. రైతులకు సంబంధించిన మార్కెట్ మౌలిక వసతులను బలోపేతం చేసి, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్య, వ్యవసాయం, మౌలిక వసతుల రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరా, అధ్యక్షులు కోదండరామిరెడ్డి, కౌన్సిలర్లు నాయకులు రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, యుగేందర్ రెడ్డి, పేపర్ల రాంరెడ్డి, రాములు యాదవ్, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లా సుధీర్ రెడ్డి దశ దినకర్మ కార్యక్రమంలో నల్గొండ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డితో కలిసి పాల్గొన్న జూలే నరసింహారెడ్డి.



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 18 (మహాప్రభ)
శుక్రవారం.దేవరకొండ మండలంలోని పడమట్ పల్లి గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లానరసింహారెడ్డి కుమారుడుపల్లా సుధీర్ రెడ్డిదశ,దినకర్మకార్యక్రమంలో నల్గొండ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ లింగారెడ్డి.తో కలిసి పాల్గొని ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపిన.నాయకులు పిఎసిఎస్ చైర్మన్ జూలే నరసింహారెడ్డి.ఆయన వెంట శాంతిగూడెం. సర్పంచ.భాస్కర్ రెడ్డి. చందంపేట.మాజీ ఎంపీపీ చందు పార్వతి.ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు,

గోసుల రాములు మృతి బాధాకరం. బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్.



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 18 (మహాప్రభ)
చందంపేట మండలం. శుక్రవారం.మాజీ సర్పంచ్ గోసుల రాములు మృతి బాధాకరం చందంపేట గ్రామంలో గోసుల రాములు మృతదేహానికి బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ పూలమాలవేసినివాళులర్పించారు. అనంతరం ఆయనకుటుంబసభ్యులను పరామర్శించారు.ఆయన వెంట జార్పుల లోక్య నాయక్, ఉప సర్పంచ్ జబ్బు శ్రీశైలం, గోసుల శివ,చెన్నకేశవులు గౌడ్, నరసింహ ,తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గణపయ్య కు పూజలు



పాపన్నపేట, సెప్టెంబర్ 18(మహాప్రభ)
మండల కేంద్రం పాపన్నపేటలో స్నేహ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా తీర్చిదీద్దిన మండపంలో కొలువు దీరిన గణపయ్యకు అర్చకులు విశేష పూజలు చేశారు.శుక్రవారం బేస్త భూపతి భూపతి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ,స్నేహ యూత్ సభ్యులు ..ప్రసాద్,యోగేష్,రఘుపతి,గంగధర్,కిరణ్,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి మండల యువతకు సువర్ణావకాశం..

-ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ!

-నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవర్.



దేవరకొండ డివిజన్ సెప్టెంబర్ 18 (మహా ప్రభ)
దేవరకొండ నల్గొండ జిల్లా నాంపల్లి.మండలంలో రాష్ట్రంలోత్వరలోజరగబోయే ఎస్సై (SI) మరియు కానిస్టేబుల్ (PC) ఉద్యోగనియామకపరీక్షలకు సన్నద్ధమవుతున్న నాంపల్లి మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోలీసు శాఖ అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది. నిరుద్యోగ యువతను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ప్రత్యేక పర్యవేక్షణలో ఉచిత.కోచింగ్.తరగతులను నిర్వహించనున్నారు. అత్యుత్తమ ఫ్యాకల్టీ చేత అందించబడే ఈ శిక్షణ కోసం అభ్యర్థులకు ఉచితంగా అకామిడేషన్ (వసతి) కూడా కల్పించ నున్నారు. వసతితో పాటు ఉద్యోగానికి అవసరమైన ఇండోర్ మరియు అవుట్ డోర్ శిక్షణను కూడా నిపుణుల ఆధ్వర్యంలో అందజేస్తామని నాంపల్లి ఎస్సైకే.లింగారెడ్డితెలిపారు.

స్క్రీనింగ్ టెస్ట్ వివరాలు:
ఈ ఉచిత శిక్షణ కార్యక్రమానికి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు గాను, ఈ ఆదివారం నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ కేంద్రాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించబడుతుంది. ఈ ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఖాకీ కలని నిజం చేసుకోవాలనుకునే ఆశావాహులు వెంటనే నాంపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా ఎస్సై కే లింగారెడ్డి తెలిపారు.

బిజినెస్

భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు



హైదరాబాద్,
బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోని పరిణామాలు, పెట్టుబడిదారుల కొనుగోళ్లు, మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల ప్రభావంతో పసిడి, వెండి ధరలు పైకి కదిలాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ధరలు మరింత భారంగా మారాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజులోనే రూ.1,450 పెరిగింది. దీంతో పసిడి ధర రూ.1,41,550కు చేరుకుంది. సాధారణంగా ఆభరణాల తయారీలో ఎక్కువగా వినియోగించే 22 క్యారెట్ల బంగారం ధర ఈ స్థాయికి చేరుకోవడం గమనార్హం. పెళ్లిళ్లు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేసే వారిపై ఈ పెరుగుదల నేరుగా ప్రభావం చూపనుంది. మరోవైపు 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర కూడా గణనీయంగా పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,580 పెరిగి రూ.1,54,420కు చేరింది. దీంతో స్వచ్ఛమైన బంగారం ధర మరోసారి రికార్డు స్థాయిల్లో కొనసాగుతోంది. బంగారాన్ని పెట్టుబడి సాధనంగా చూసే వారిలోనూ ధరల పెరుగుదల ఆసక్తిని పెంచుతోంది. వెండి ధరల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. కిలో వెండి ధర ఏకంగా రూ.5,000 పెరిగింది. దీంతో కిలో వెండి ధర రూ.2,50,000కు చేరుకుంది. పారిశ్రామిక అవసరాలతో పాటు ఆభరణాలు, పెట్టుబడుల కోసం వెండికి డిమాండ్ ఉండటంతో ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ బంగారం, వెండి ధరలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. అయితే నగరాలు, ప్రాంతాలను బట్టి స్థానిక పన్నులు, తయారీ చార్జీలు, ఇతర ఖర్చుల కారణంగా ఆభరణాల దుకాణాల్లో తుది ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. బంగారం కొనుగోలు చేసే సమయంలో రోజువారీ మార్కెట్ ధరతో పాటు మేకింగ్ చార్జీలు, జీఎస్టీ తదితరాలను కూడా వినియోగదారులు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వరుసగా ధరలు పెరుగుతుండటంతో బంగారం, వెండి మార్కెట్‌పై కొనుగోలుదారుల దృష్టి మరింత పెరిగింది. ధరలు మరింత పెరుగుతాయా, లేక కొంతకాలం తర్వాత తగ్గుతాయా అన్నది మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతానికి మాత్రం పసిడి, వెండి ధరలు భారీ స్థాయిలో కొనసాగుతున్నాయి.

జెప్టోలో ఐఫోన్ 18 ప్రో అమ్మకాలు ప్రారంభం



న్యూఢిల్లీ,
ప్రముఖ శీఘ్ర వాణిజ్య సంస్థ జెప్టోలో ఐఫోన్ 18 ప్రో సిరీస్ విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్‌తో పాటు ఎయిర్‌పాడ్స్ 5ను కూడా జెప్టో ద్వారా కొనుగోలు చేసే అవకాశం వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ విక్రయాలను ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలకే పరిమితం చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న వినియోగదారులు జెప్టో ద్వారా తమకు కావాల్సిన ఉత్పత్తులను ఆర్డర్ చేసుకోవచ్చు. ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ కొనుగోలుపై ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులతో చెల్లింపు చేస్తే గరిష్ఠంగా రూ.7,000 వరకు తక్షణ రాయితీ పొందవచ్చు. దీంతో కొత్త ఐఫోన్ కొనుగోలుదారులకు కొంత ధర ప్రయోజనం లభించనుంది. అలాగే ఎయిర్‌పాడ్స్ 5 కొనుగోలుపై రూ.1,500 వరకు రాయితీ అందిస్తున్నారు. ఈ ప్రత్యేక రాయితీలు ఎంపిక చేసిన యాక్సిస్, ఐసీఐసీఐ, ఎస్‌బీఐ బ్యాంకులకు చెందిన క్రెడిట్ కార్డులకు మాత్రమే వర్తిస్తాయి. కార్డు, ఆఫర్ నిబంధనలను బట్టి రాయితీలో మార్పులు ఉండే అవకాశం ఉంది.

రూ.51కే జియో అపరిమిత 5జీ డేటా ప్లాన్!

ముంబై, సెప్టెంబర్ 18
రిలయన్స్ జియో తమ వినియోగదారుల కోసం రూ.51కే అపరిమిత 5జీ డేటా సౌకర్యాన్ని అందించే కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. తక్కువ మొత్తంతో 5జీ డేటాను వినియోగించుకోవాలనుకునే వారికి ఈ ప్లాన్ ఉపయోగపడనుంది. ఈ ప్లాన్ ద్వారా 4జీ వినియోగదారులు కూడా 5జీ సేవలను పొందే అవకాశం ఉంది. అయితే ఇందుకోసం వినియోగదారుల వద్ద ఇప్పటికే రోజుకు 1.5 జీబీ డేటా, నెల రోజుల కాలపరిమితి ఉన్న ప్రస్తుత రీఛార్జ్ ప్లాన్ ఉండాలి. అలాంటి ప్లాన్ ఉన్నవారు అదనంగా రూ.51తో రీఛార్జ్ చేసుకుంటే 5జీ అపరిమిత డేటా సౌకర్యాన్ని పొందవచ్చు. రూ.51 ప్లాన్‌కు ప్రత్యేకంగా కొత్త కాలపరిమితి ఉండదు. వినియోగదారుడి ప్రస్తుత రీఛార్జ్ ప్లాన్ ఎంతకాలం చెల్లుబాటులో ఉంటుందో అంతకాలం ఈ అదనపు 5జీ డేటా సౌకర్యం కూడా కొనసాగుతుంది. అంటే ప్రస్తుత ప్లాన్ గడువు ముగిసే వరకు రూ.51 ప్లాన్



ప్రయోజనాలను వినియోగించుకోవచ్చు. అయితే అపరిమిత 5జీ డేటా పొందాలంటే వినియోగదారుడి ప్రాంతంలో జియో 5జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉండాలి. అలాగే 5జీ సేవలకు అనుకూలమైన ఫోన్ అవసరం. 5జీ నెట్‌వర్క్ పరిధిలోకి వెళ్లినప్పుడు అపరిమిత డేటాను వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం రోజువారీ డేటా పరిమితి కారణంగా అదనపు డేటా కోసం ప్రత్యేక రీఛార్జ్‌లు చేసుకునే వినియోగదారులకు ఈ రూ.51 ప్లాన్ మరో అవకాశంగా మారింది. తక్కువ ధరతో అదనపు 5జీ డేటాను పొందే అవకాశం ఉండటంతో జియో వినియోగదారుల్లో ఈ ప్లాన్‌పై ఆసక్తి నెలకొంది.

స్పోర్ట్స్

చరణి స్పిన్‌కు జపాన్ విలవిల..
ఆసియా క్రీడల సెమీఫైనల్లో భారత్..!



ఆసియా క్రీడల్లోనూ భారత మహిళల జట్టు అదరగొట్టింది. క్వార్టర్ ఫైనల్లో తిప్పేసిన శ్రీ చరణి(4-10) కెరీర్లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయడంతో అలవోకగా జపాన్ ను చిత్తు చేసింది టీమిండియా. స్వల్ప ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్, 2-13) విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించింది. ఎనిమిది వికెట్ల తేడాతో భారీ విజయం సాధించిన ఉమెన్ ఇన్ బ్లూ సెమీస్‌కు దూసుకెళ్లింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునే దిశగ సాగుతోంది. నిరుడు గోల్డ్ మెడల్‌తో సత్తా చాటిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. దర్జాగా సెమీస్‌లో దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్ బ్యాటర్లను శ్రీ చరణి(4-10) వణికించింది. ఈ తెలుగమ్మాయి సంచలన ప్రదర్శనరతో 57 పరుగులకే ఆతిథ్య దేశం జట్టు కుప్పకూలింది. అనంతరం ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో 5 ఓవరల్లోనే ఉమెన్ ఇన్ బ్లూ జయకేతనం ఎగురవేసింది.

చరణి, షఫాలి పోటీపడి
తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్‌ను భారత స్పిన్నర్లు స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. ఓపెనర్ అయకా కటో స్టఫోర్డ్(25) ప్రతిఘటించినా.. శ్రీ చరణి(4-10), షఫాలీ వర్మ(2-13)ల ధాటికి మిగతా వారు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఒకే ఓవర్లో రెండేసి వికెట్లతో చరణి జపాన్‌ను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఈ స్పిన్ ద్వయం వికెట్ల వేటతో ప్రత్యర్థిని 57కే పరిమితం చేసింది టీమిండియా. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఐదు ఓవర్లలోనే టీమిండియా ఉఫ్‌మనిపించింది.ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) మెరుపు అరంభాన్నిస్తూ.. 15 బంతుల్లోనే ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో విరుచుకుపడింది. జి.కమలిని(0), భారతి ఫుల్‌మాలి(6)లు విఫలమైనా షఫాలి దూకుడుతో జపాన్ బౌలర్లు అల్లాడిపోయారు. రీచా ఘోష్(12 నాటౌట్) జతగా టీమిండియాకు 8 వికెట్ల విజయం కట్టబెట్టింది డాషింగ్ ఓపెనర్. అద్భుత విజయంతో సెమీస్ చేరిన భారత్.. ఫైనల్ బెర్తు కోసం సెప్టెంబర్ 20వ తేదీన బంగ్లాదేశ్‌ను ఢీ కొట్టనుంది. అదే రోజు ఉదయం తొలి సెమీస్‌లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి.

ఆసియా హంగామా.. నేటి నుంచి ఆసియా గేమ్స్

-45 దేశాల నుంచి 11 వేల క్రీడాకారులు పోటీ
-భారత్ నుంచి బరిలో 501 మంది
-హాంగ్జౌ 106 పతకాల రికార్డును దాటడమే లక్ష్యం



నగోయా
ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబురం, భారత క్రీడాకారులు స్వర్ణకాంతులు.. వెండి వెలుగులు.. కంచు మోతలు మోగించే మెగా క్రీడోత్సవం రానే వచ్చింది. 20వ ఎడిషన్ ఆసియా గేమ్స్‌కు జపాన్‌లోని పారిశ్రామిక నగరం నగోయా సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. శనివారం అట్టహాసంగా జరిగే ప్రారంభోత్సవంతో మెగా గేమ్స్ హంగామా అధికారికంగా షురూ కానుంది. ఒలింపిక్స్ కంటే ఎక్కువ క్రీడలు (43 విభాగాల్లో) ఉన్న ఆసియాడ్‌లో 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పోటీపడుతున్నారు. 2022 హాంగ్జౌ ఆసియాడ్‌లో నాలుగో స్థానంలో నిలిచి సాధించిన చారిత్రాత్మక 106 పతకాల రికార్డును తిరగరాయాలనే పట్టుదలతో భారత్ ఈసారి 501 మంది అథ్లెట్లతో కూడిన భారీ బృందాన్ని 37 ఆటల్లో బరిలోకి దింపుతోంది. 2036 నాటికి ప్రపంచ టాప్-10 క్రీడా దేశాల్లో ఒకటిగా, 2047 నాటికి టాప్-5లో నిలవాలనే భారత్ సుదీర్ఘ లక్ష్యానికి ఈ ఆసియా క్రీడోత్సవం ఒక కీలకమైన పరీక్షగా నిలవనుంది. ఎన్నో ఆశలతో నగోయా చేరుకున్న భారత అథ్లెట్లు ఇరుకైన గదులు, పోటీలకు సుదూర ప్రాంతాల్లోని అరకొర వసతులతో ఎదురైన ఇబ్బందులను పక్కనబెట్టి తమ దృష్టిని మైదానంలో ప్రదర్శనపై కేంద్రీకరించారు. అక్టోబర్ 4వ తేదీ వరకు ఈ మెగా ఈవెంట్ జరగనుంది.

అథ్లెటిక్స్, షూటింగ్‌పై భారీ ఆశలు
భారత పతకాల వేటలో అథ్లెటిక్స్, షూటింగ్ విభాగాలు కీలక పాత్ర పోషించనున్నాయి. వరుసగా రెండుసార్లు పసిడి నెగ్గిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా గాయం కారణంగా దూరమైనప్పటికీ 74 మందితో కూడిన భారత అథ్లెటిక్స్ దళం కొండంత ఆశలతో ఉంది. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ హ్యాట్రిక్ స్వర్ణం సాధించాలని పట్టుదలతో ఉన్నాడు. మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (డిస్టెన్స్ రన్), రోహిత్ యాదవ్ (జావెలిన్), తేజస్విన్ శంకర్ (డెకాథ్లాన్), యర్రాజి జ్యోతి (100 మీటర్ల హర్డిల్స్), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) పసిడి రేసులో ముందున్నారు. గత ఎడిషన్‌లో 6 గోల్డ్ సహా 29 మెడల్స్ సాధించిన అథ్లెటిక్స్ విభాగం నుంచి భారత్ మరోసారి ఆ స్థాయి ప్రదర్శన ఆశిస్తోంది. ఇక, షూటింగ్‌లో ఒలింపిక్ డబుల్ మెడలిస్ట్ మను భాకర్, గత ఆసియాడ్‌లో స్వర్ణం, మూడు రజతాలు నెగ్గిన తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నారు. వీళ్ల నేతృత్వంలోని 30 మంది షూటర్లు పతకాలపై గురి పెట్టారు. అంతర్జాతీయ షూటింగ్ ఈవెంట్లలో అదరగొడుతున్న భారత్‌కు ఈ మెగా గేమ్స్‌లో చైనా షూటర్ల నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది.

బీసీసీఐ చీఫ్ సెలెక్టర్‌గా పార్థివ్ పటేల్..
అగార్కర్‌కు చెక్ పడటం ఖాయమేనా!

త్వరలో ముగియనున్న అజిత్ అగార్కర్ పదవీకాలం
చీఫ్ సెలక్టర్ రేసులో ముందున్న పార్థివ్ పటేల్
ఇటీవల బీసీసీఐ రివ్యూ మీటింగ్‌కు అగార్కర్ డుమ్మా



భారత పురుషుల క్రికెట్ సెలెక్షన్ కమిటీలో త్వరలోనే భారీ మార్పులు చోటుచేసుకునేలా కనిపిస్తున్నాయి. ప్రస్తుత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కాంట్రాక్ట్ పొడిగింపుపై బీసీసీఐతో సమ్మతి కుదరకపోతే, అతడి స్థానంలో మరొకరిని ఎంపిక చేసే అవకాశం ఉంది. అయితే ఈ రేసులో భారత మాజీ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ ముందంజంలో ఉన్నాడు! గత ఆరు నెలలుగానే భారత క్రికెట్ వర్గాల్లో పార్థివ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోందని, బోర్డులోని కీలక అధికారులు అతడి వైపే మొగ్గు చూపుతున్నారని సమాచారం.

కీలక మీటింగ్‌కు అగార్కర్ డుమ్మా!
ఇటీవల హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, టెస్ట్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌లతో బీసీసీఐ నిర్వహించిన అత్యున్నత స్థాయి రివ్యూ మీటింగ్‌కు అగార్కర్ హాజరుకాకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. అతడు వ్యక్తిగత పనుల వల్ల అందుబాటులోకి రాలేకపోయాడని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. అయితే అంత ముఖ్యమైన సమావేశానికి చీఫ్ సెలెక్టర్ రాకపోవడం వెనుక పెద్ద కారణమే ఉందనే ప్రచారం జరుగుతోంది.ఒకవేళ ఈ బాధ్యతలు పార్థివ్ పటేల్‌కు దక్కితే, అతడు 25 టెస్టుల అనుభవంతో ప్రస్తుత సెలెక్షన్ ప్యానెల్‌లోనే అత్యంత సీనియర్ సభ్యుడిగా ఉంటాడు. ప్రస్తుతం ఉన్న ప్యానెల్‌లో ఎస్.ఎస్ దాస్ (23 టెస్టులు), ఆర్పీ సింగ్ (14), ప్రజ్ఞాన్ ఓజాయ్ (24), అజయ్ రాత్రా (6) ఉన్నారు. వెస్టిండీస్‌తో సిరీస్, ఇరానీ కప్‌లకు జట్లను ఎంపిక చేయడమే అగార్కర్‌కు చివరి సెలెక్షన్ మీటింగ్ అని జోరుగా ప్రచారం సాగుతోంది.

2027 వన్డే వరల్డ్ కప్ దిశగా వ్యూహాలు
ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ జట్టుకు అసిస్టెంట్ అండ్ బ్యాటింగ్ కోచ్‌గా సేవలు అందిస్తున్న పార్థివ్ పటేల్, ఈ బీసీసీఐ రోల్ ఖరారైతే ఐపీఎల్ బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. 2027 వన్డే ప్రపంచ కప్ సమీపిస్తున్న వేళ, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ కొనసాగుతున్న తరుణంలో, టీమిండియా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.



హాట్ పోజులతో హీట్ పుట్టిస్తున్న 'హిట్' బ్యూటీ మీనాక్షి చౌదరి

ది ప్యారడైజ్' చిత్రానికి మరో టైటిల్ పెట్టాల్సి వస్తే అది 'సమ్మక్క' : నాని



నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్' . ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్.అయితే ప్రమోషన్స్‌లో భాగంగా కథనాయకుడు నాని ఈ సినిమా టైటిల్‌పై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. నాని మాట్లాడుతూ.. ఒకవేళ తమ సినిమాకు 'ది ప్యారడైజ్' కాకుండా వేరే ప్రత్యామ్నాయ శీర్షిక పెట్టాల్సి వస్తే మాత్రం ఖచ్చితంగా 'సమ్మక్క' అనే టైటిల్ సరిగ్గా సరిపోతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నాని చేసిన ఈ వ్యాఖ్యలు సినిమా సర్కిల్స్‌లో, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే సమ్మక్క అనేది నాని తల్లి పాత్ర పేరు అని తెలుస్తుంది. కాగా దీనిపై క్లారిటీ రావాలంటే సినిమా వచ్చేవరకు వెయిట్ చేయాలి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. భారీ తారాగణంతో వస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆరు నెలల్లో వెయ్యికోట్లు



'పుష్ప' ఫ్రాంచైజీ, యానిమల్, ఛావా, సికిందర్, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో ఓకే ఏడాది వేలకోట్ల వసూళ్లు రాబట్టి సినీ సామ్రాజ్యానికి క్వీన్‌గా అవతరించింది రష్మిక మందన్న. ఇక ఏ హీరోయిన్‌కైనా ఈ స్థాయి ట్రాక్ రికార్డు కష్టమే అని అంతా అనుకుంటున్న తరుణంలో ఉన్నట్టుండి మలయాళ భామ మమితాబైజు ఊడిపడింది. ఆర్నెల్ల క్రితం ధనుష్‌తో ఆమె నటించిన 'కర' సినిమా పెద్దగా ఆడలేదు. కానీ 50కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇక అక్కడ్నుంచి మొదలైంది మమితాబైజు విజయవిహారం.ప్రదీప్ రంగనాథ్‌తో ఆమె నటించిన 'డ్యూడ్' సినిమా వందకోట్ల వసూళ్లు రాబట్టింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి నటించిన 'జననాయగన్' 300కోట్లు, రీసెంట్‌గా విడుదలైన మలయాళ చిత్రం 'బెత్లహోమ్ కుటుంబ యూనిట్' చిత్రం 300కోట్లు, సూర్య తాజా బ్లాక్‌బస్టర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో 260కోట్లు.. ఇలా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే తన సినిమాల వసూళ్లతో వెయ్యికోట్ల మార్క్‌ని దాటేసింది మమితా బైజు. ఆమె నటించిన మూడు సినిమాలు వరుసగా 200కోట్ల వసూళ్లు రాబట్టడం విశేషం.

ఓటీటీలోకి వచ్చేసిన రవితేజ 'ఇరుముడి'..



మాస్ మహారాజా రవితేజ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'ఇరుముడి' ఓటీటీలోకి వచ్చేసింది. టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే పవిత్రమైన భావోద్వేగాలు మరియు అంకితభావంతో కూడిన భక్తి నేపథ్యంలో రూపొందింది. థియేటర్లలో ప్రేక్షకులను ఎంతగానో అలరించిన ఈ సినిమా, ఇప్పుడు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు నేటి నుంచి (సెప్టెంబర్ 18) ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ వేదిక 'నెట్‌ఫ్లిక్స్' లో అధికారికంగా స్ట్రీమింగ్ అవుతోంది.కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఈ చిత్రం ఒకేసారి అందుబాటులోకి రావడం విశేషం. కుటుంబ సమేతంగా హాయిగా ఇంటి వద్దే కూర్చుని చూసేందుకు తగిన చక్కటి ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. థియేటర్లలో ఈ సినిమాను వీక్షించలేకపోయిన ప్రేక్షకులు, అభిమానులు నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ అద్భుతమైన చిత్రాన్ని వీక్షించవచ్చు.

మహేశ్‌బాబుతో భన్సాలీ సినిమా?

అగ్ర హీరో మహేశ్‌బాబుతో ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారా? అంటే ఔననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. సంజయ్‌లీలా భన్సాలీ ఇటీవలే మహేశ్‌బాబుని కలిసి కథ చెప్పారని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. భన్సాలీ శైలి భారీ సెట్లు, గ్రాండ్ విజువల్స్, బలమైన భావోద్వేగాలతో సాగే పీరియాడిక్ కథ ఇదని ప్రచారం జరుగుతున్నది. గతంలో కూడా అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి అగ్ర హీరోలతో సంజయ్‌లీలా భన్సాలీ సినిమా చేయొచ్చనే వార్తలొచ్చాయి.అయితే ఇవేవీ కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు-భన్సాలీ ప్రాజెక్ట్‌పై జరుగుతున్న ప్రచారం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం మహేశ్‌బాబు 'వారణాసి'పైనే తన దృష్టిని కేంద్రీకరించారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతున్నది. ఇక సంజయ్‌లీలా భన్సాలీ 'లవ్ అండ్ వార్' చిత్రం జనవరిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ రెండు చిత్రాలు పూర్తయ్యాకే మహేష్‌బాబు-సంజయ్‌లీలా భన్సాలీ సినిమాపై స్పష్టత వస్తుందంటున్నారు.



'ధురంధర్', 'హనుమాన్ అంశ్' చిత్రాలకు షాక్..

ఆస్కార్ బరిలో మరాఠి సినిమా..!

భారత దేశం నుంచి అందర్నీ ఆశ్చర్యపరుస్తూ మరాఠి చిత్రం 'గొంధల్' ఆస్కార్ 2027 బరిలో నిలిచింది. వచ్చే ఏడాది అకాడమీ అవార్డులకు ఈ సినిమా అధికారికంగా ఎంట్రీ సాధించింది. ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ 'ధురంధర్' సిరీస్, ఇటీవలే వసూళ్లలో పుంజుకున్న 'హనుమాన్ అంశ్' చిత్రాలను వెనక్కి నెట్టిందీ మరాఠి థ్రిల్లర్. సంతోష్ దవాష్కర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా 99వ అకాడమీ అవార్డుల్లో 'బెస్ట్ ఇంటర్నేషన్ ఫీచర్ విభాగం'లో పోటీపడనుంది. ఈ విషయాన్ని భారతీయ చిత్ర సమఖ్య శుక్రవారం వెల్లడించింది.వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డులకు భారత్ నుంచి మరాఠి చిత్రం గొండ్‌ల్ ఎంపికైంది. బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ విభాగంలో ఈ సినిమా అధికారికంగా ఎంట్రీ సాధించింది. ఆస్కార్ నామినేషన్ కోసం దేశవ్యాప్తంగా మొత్తం 33 సినిమాలు పోటీపడ్డాయి. వీటిలో 14 హిందీ సినిమాలు ఉండగా.. తెలుగు నుంచి పెద్ది, ఇరుముడి, సింగ్ గీతం, ఎగ్వాలు రిజిస్టర్ అయ్యాయి. ఇక గుజరాతీ, మరాఠి నుంచి నాలుగేసి చిత్రలు, తమిళం నుంచి మూడు, మలయాళం నుంచి ఒకటి, నగమెసె నుంచి ఒకటి.. ఒక సైలెంట్ ఫిల్మ్ ఉన్నాయి. చివరకు సంతోష్ దవాష్కర్ తెరకెక్కించిన ఈ థ్రిల్లర్ కథాంశానికి జ్యూరీ ప్యానెల్ జై కొట్టింది. సంతోష్ 2025లో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఇండియాలో సిల్వర్ పికాక్ అవార్డు విజేత. 99వ ఆస్కార్ వేడుకలు 2027 మార్చి 14వ తేదీన లాస్ ఎంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో జరుగనున్నాయి.



Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com